ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.8	27.6
కావలి	37	27
ఆత్మకూరు	40	27
ఉదయగిరి	40	26
కందుకూరు	37	27

ఆయన మాట అసభ్యకరం..

వైఖరి బెదిరించడం!

పశుసంవర్ధక శాఖలో ఓ ఉన్నతాధికారి తీరిది


పశుసంవర్ధక శాఖలో ఉన్నతాధికారిగా ఆయనకు ఈమధ్యనే పదోన్నతి లభించింది. ఆయనకున్న అనుభవం దృష్ట్యా ఆ శాఖ ద్వారా పాడిరైతులకు ఎంతో న్యాయం చేయగలరని అధికారులు, సిబ్బంది భావించారు. అయితే అంతా రివర్స్ అయ్యింది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే ఆ అధికారి తీరులో మార్పు వచ్చింది. కిందిస్థాయి సిబ్బందిని దురుసుగా మాట్లాడటం పరిపాటిగా మారింది. చివరకు ఆ శాఖ మంత్రినే హేళనగా మాట్లాడటంతో ఆయన ఆగ్రహానికి గురై చర్యలకు సిఫారసు చేయడంతో ఆ అధికారి వ్యవహారం జిల్లావ్యాప్తంగా చర్చకు దారితీసింది.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పశుసంవర్ధక శాఖలో ఓ కీలక అధికారి తీరుతో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది మనోవేదనకు గురవుతున్నారు. గట్టిగా అరుస్తూ తిట్టడం ఆయన ప్రత్యేకతగా చెప్పుకుంటుంటారు. ఆయనకు తెలియకుండా ఏదైనా సమాచారం బయటకు పొక్కిందంటే ఇక కార్యాలయ సిబ్బంది మొత్తాన్ని పిలిపించి మరీ బెదిరించి భయపెడతారు. మాకు పోయేదేమీ లేదంటూ మరింత వాడకూడని భాషను వినియోగిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. గేదెలతో పోలుస్తూ హేళనగా మాట్లాడుతుంటారని సిబ్బంది వాపోతున్నారు.

● ఒకరి పని.. ఇద్దరికి కేటాయింపా!?

జిల్లా కార్యాలయంలో ఆయన తరువాత అంతటి అధికారాలు కలిగిన నోడల్ అధికారి సీటు ఒకటి ఉంటుంది. ఆ అధికారి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆ నోడల్ అధికారి సీటుకు గట్టి పోటీ వచ్చింది. ఇద్దరు మంత్రుల నుంచి సిఫారసు పత్రాలు కూడా తీసుకొచ్చారు. అంతటి ప్రాధాన్యం ఉన్న ఆ సీటు సేవలు గతంలో ఒక్కరే అందించేవారు. ప్రభుత్వ పథకాలు రైతులకు సక్రమంగా అందుతున్నాయా!? లేదా!? మందులు, పశువులకు సంబంధించి టీఎంఆర్, సమీకృత దాణా వంటివి కేటాయింపులు సక్రమంగా చేయడం, అవసరమైన మేర ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపడం ఆ నోడల్ అధికారి ముఖ్య విధులు. అయితే ఆ సేవలను ఇద్దరికి కేటాయించడం ఆ శాఖలో పెద్ద చర్చకు దారి తీసింది. అదికూడా జిల్లా కార్యాలయంలో పనిచేసే అధికారితో కాకుండా మరో డివిజన్ అధికారికి ఇవ్వడంపై విమర్శలు వస్తున్నాయి. పరిపాలన అవసరాల దృష్ట్యా ఇద్దరిని పెట్టుకోవడంలో ఇబ్బంది లేదని అయితే మరో డివిజన్ అధికారికి కేటాయించడమే ఇక్కడ చర్చకు దారితీసింది.



● మంత్రినే హేళన చేసిన వైనం

ఓ మహిళా ఉద్యోగిని జిల్లాలోని ఓ మండలంలో నాన్‌లోకల్ కింద సచివాలయంలో విధులు నిర్వహిస్తోంది. అయితే డిప్యుటేషన్‌పై తన సొంత జిల్లాకు పంపాలని కోరుతూ ఆ శాఖ మంత్రి నుంచి సిఫారసు లేఖ కూడా తెచ్చుకుంది. డివిజనల్ స్థాయిలోనూ ఆమెకు అవసరమైన పత్రాలన్నీ సిద్ధమై జిల్లాస్థాయి అధికారి కార్యాలయానికి చేరుకున్నాయి. వీటిని పరిశీలించిన ఆయన ఆమెను కార్యాలయానికి పిలిపించి, తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగక మంత్రి ఆహార్యాన్ని హేళన చేయడంపై ఆమె రికార్డు చేసినట్లు తెలిసింది. ఈ రికార్డ్ వాయిస్ సదరు మంత్రికి చేరడంతో ఆయన ఆగ్రహానికి గురికావాల్సి వచ్చిందని సమాచారం. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఈ విషయంపై చర్చ నడుస్తోంది. సదరు ఉన్నతాధికారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కూ ఆదేశాలు అందాయని సమాచారం.

● క్షేత్రస్థాయి పర్యటనకు వెళితే..

ఆ అధికారి క్షేత్రస్థాయి పర్యటనకు వస్తున్నారంటే ఆయా మండలాల అధికారుల జేబుకు చిల్లుపడాల్సిందే. రేపు మీ మండలంలో క్షేత్రస్థాయిలో పరిశీలన ఉంటుంది.. మీ పనితీరుపై చర్చ ఉంటుందంటూ ప్రత్యేక మెనూ గురించి ప్రత్యేకంగా చెప్పిస్తారని, అదిలేనిదే ఆయనకు ముద్ద దిగదు అంటుంటారు. ఆయన వెళ్లే ప్రదేశాన్ని బట్టి అక్కడ మాత్రమే అందుబాటులో ఉండే ప్రత్యేక మాంసాహార భోజనం చేయించాల్సిందేనని చెబుతున్నారు. అంతేకాదండోయ్... సదరు అధికారి కారుకు ట్యాంకు నిండా డీజిల్ నింపి ఇంకేదో సమర్పించుకుని అక్కడి నుంచి వీడ్కోలు పలుకుతారనే ఆరోపణలు ఉన్నాయి.



ఉమ్మడి జిల్లాలో న్యాయాధికారుల బదిలీ

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న పలువురు న్యాయాధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న ఎన్ లావణ్యను విశాఖపట్నం జిల్లా మాడుగుల జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేసింది. అమె స్థానంలో ఎవరినీ నియమించలేదు. మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న బీ అఖిలను ప్రకాశం జిల్లా అద్దంకి అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా బదిలీ చేశారు. అమె స్థానంలో కర్నూలు జిల్లా కోయిలకుంట్లలో జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న అబ్దుల్ రహమాన్ షేక్‌ను నియమించారు. నాల్గవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న టీ భాస్కర్‌ను కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. అయన స్థానంలో ప్రకాశం జిల్లా చీరాల మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిషాద్ నాజ్ షేక్‌ను నియమించారు. నెల్లూరు 5వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న గండికోట దేవికను విజయవాడ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. నెల్లూరు ఎక్సైజ్ మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న టీ సుయోధన్‌ను కడప జిల్లా రాయజోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. గూడూరు కోర్టు మేజిస్ట్రేట్ పీ లోక్‌నాథంను అనంతపురం జిల్లా కదిరి కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. కోట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ భరత్ కమల్‌ను కడప జిల్లా లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జిగా, కోవూరు ప్రిన్సిపల్ జూనియ ర్ సివిల్ జడ్జి జీ కాత్యాయనిని ప్రకాశం జిల్లా చీరల మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. సూళ్లూరుపేట కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ అనిల్ కుమార్‌ను కర్నూలు ఎక్సైజ్ కోర్టు మేజి స్ట్రేట్‌గా బదిలీ చేశారు. వెంకటగిరి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి వో అనూషను కృష్ణా జిల్లా నూజీవీడు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో చిత్తూరు జిల్లా నగరి మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న ఎస్ విష్ణు వర్మను నియమించారు. నాయుడుపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పీ సంయుక్తను సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. అమె స్థానంలో అనంతపురం జిల్లా కదిరి జ్యుడీషియల్ మేజి స్ట్రేట్ పీ మీనాక్షి సుందరిని నియమిం చారు. సూళ్లూరుపేట అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్ అనూషను కర్నూలు మొబైల్ కోర్టు న్యాయాధికారిగా బదిలీ చేశారు.

పరిశ్రమ పెడతారా..

భూమిని తిరిగిచ్చేస్తారా!?

పారిశ్రామిక పార్కుల్లో ఖాళీ స్థలాలపై ఏపీఐఐసీ దృష్టి

ఇప్పటికే భూమి తీసుకున్నవారికి నోటీసులు

పరిశ్రమలు నెలకొల్పాలంటూ అవగాహన, ఒత్తిడి

నెల్లూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రా మికీకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రతి సెంటు భూమిని సద్వినియోగం చేసుకుని పరిశ్రమలు నెలకొల్పేలా ఎప్పటికప్పుడు కీలక ఉత్తర్వులు జారీ చేస్తోంది. ఈ క్రమంలోనే గతంలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చి భూములు తీసుకున్న ఔత్సాహి కులను కదిలిస్తోంది. భూములు పొందాక కూడా ఎందుకు పరిశ్రమ నెలకొల్ప లేదంటూ వారిపై ఒత్తిడి తెస్తోంది. జిల్లాలో ఇప్పటివరకూ జరిపిన భూ కేటాయింపులు.. ప్రస్తుతం ఆ భూమి స్థితి.. పరిశ్రమలు ఎందుకు నెలకొల్ప లేదు? వంటి వివరాలను ఏపీఐఐసీ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఇండస్ట్రీయల్ పార్కుల్లోని డేటా కూడా క్రోడీకరిం చారు. జిల్లాలో 250 ఎకరాలకు సంబంధించి 30 మంది యజమానులకు నోటీసులు వెళ్లగా 20 మందికి పంపిన నోటీసులు వెనక్కు వచ్చాయి. దీంతో వీరికి కేటాయించిన భూములను రద్దు చేసేందుకు అధికారులు చర్యలు మొదలుపెట్టారు. ఇక నోటీసులు అందుకున్న వారి నుంచి సమాధానం వచ్చాక తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఎకరంలోపు భూమి తీసుకుంటే నిబంధనల ప్రకారం రెండేళ్లలోపు పరిశ్రమ స్థాపించాల్సి ఉంటుంది. ఆ పైన భూమిని తీసుకుంటే స్థాపనకు మూడేళ్ల వరకూ గడువు ఉంటుంది. ఇప్పుడు నోటీసులు అందుకున్న వారిలో మెజారిటీ మంది 2018, 2019లో భూములు పొందిన వారే ఉన్నారు.

● ఒప్పించేందుకు ప్రయత్నాలు

పారిశ్రామిక అభివృద్ధికి జిల్లాలో విస్తృత అవకాశాలున్నాయి. ఓ వైపు కృష్ణపట్నం, మరోవైపు రామాయపట్నం పోర్టుల మధ్య పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఉంది. గతంలో ఎంఎస్ఎంఈ యూనిట్లు స్థాపించేందుకు ఔత్సాహికులు ముందుకొచ్చేవారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో పారిశ్రామిక పాలసీను మార్చడంతో పరిస్థితిలో మార్పొచ్చింది. 2019 వరకూ అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇండస్ట్రీయల్ పార్కుల్లో భూమిని సగం ధర సబ్సిడీతో సేల్ డీడ్ రూపంలో కేటాయించేవారు. ఇలా సేల్‌డీడ్ ఇవ్వడం ద్వారా బ్యాంకులో రుణం తెచ్చుకోవడం సులభమయ్యేది. కానీ వైసీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని మార్చి లీజు డీడ్ తీసుకొచ్చింది. అంటే ఒక పారిశ్రామిక వేత్త రూ.కోట్లు ఖర్చు చేసి పరిశ్రమల నెలకొల్పినా ఆ భూమి మాత్రం తన పేరు మీద ఉండదు. ఈ కారణంగా ఇండస్ట్రీ యల్ పార్కుల్లో ప్లాట్లు తీసుకునేందుకు ఔత్సాహికులు ముందుకు రాలేదు. ఇది గమనించిన వైసీపీ గతేడాది ఎన్నికల ముందు మళ్లీ పాలసీని మార్చి సేల్‌డీడ్ విధానాన్ని పునరుద్ధరించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు చర్యలు మొదలుపెట్టింది. నిర్ణీత గడువులోపు పరిశ్రమలు నెలకొల్పాలని వారికి అవగాహన కల్పించి వీలైనంత వరకూ ఆ భూమిలో ఏదో ఒక పరిశ్రమ నెలకొల్పేలా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. కాకుటూరు వద్ద ఉన్న ఇండస్ట్రీయల్ పార్కులో కూడా చాలా ప్లాట్లు ఖాళీగా ఉండడంతో అక్కడా పరిశ్రమలు స్థాపించాలని, లేకపోతే ఎవరికైనా లీజుకు ఇవ్వాలని ఆ ప్లాట్ల యజమానులపై అధికారులు ఒత్తిడి తెస్తున్నారు.



ఆత్మకూరు : నారంపేట ఇండస్ట్రీయల్ పార్కు

ముత్తుకూరులో ఇండస్ట్రీయల్ పార్క్

ముత్తుకూరు మండలంలో రెండు ఇండస్ట్రీయల్ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణపట్నంలో 87.56 ఎకరాలు, నేలటూరులో 220.81 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏపీఐఐసీకి ఉచితం కేటాయించేలా తీర్మానించారు. ఈ రెండు చోట్లా పార్కులు అభివృద్ధి చేసి సేల్ డీడ్ విధానంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలకనున్నారు. అలానే ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకై ఇప్పటికే అధికారులు భూములను గుర్తించారు. ఈ భూములను ఏపీఐఐసీకి అప్పగించడమే మిగిలి ఉంది. కాగా ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసుల అంశంపై ఏపీఐఐసీ జడ్ఎం శివకుమార్‌ను వివరణ కోరగా భూములు తీసుకున్న తర్వాత నిర్ణీత గడువులోపు పరిశ్రమలు స్థాపించని వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి వారికి అవగాహన కల్పించి పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చూస్తున్నామని చెప్పారు. అయినా పరిశ్రమలు స్థాపించకపోతే భూకేటాయింపులు రద్దు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

జిల్లావ్యాప్తంగా స్లాట్ బుకింగ్

26 నుంచి అమలులోకి..

రిజిస్ట్రేషన్ సేవలు ఇక సులభతరం

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్ సేవలు మరింత సులభతరం కానున్నాయి. రవాణా శాఖలో లైసెన్సుల జారీకే మాత్రమే అందుబాటులో వున్న స్లాట్ బుకింగ్ విధానాన్ని రిజిస్ట్రేషన్ శాఖలోనూ ప్రవేశపెట్టింది. జిల్లాలో తొలుత నెల్లూరులోని ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పైలట్ ప్రాజెక్టు కింద ఈ నెల 4న ఈ విధానం అమలులోకి వచ్చింది. ఇప్పటివరకు 556 దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరగ్గా, రూ.6.09 కోట్ల ఆదాయం ఆ శాఖకు సమకూరింది. ఇక్కడ విజయవంతం కావడంతో స్లాట్ బుకింగ్ విధానాన్ని ఈ నెల 26 నుంచి జిల్లావ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయడానికి అధికారులు నిర్ణయించారు. ఈ విధానం అమలులో ఉండే కార్యాలయాల్లో దస్తావేజులను నేరుగా తీసుకొని వెళితే రిజిస్ట్రేషన్లు చేయరు. స్లాట్ బుకింగ్ పద్ధతిలో మాత్రమే చేస్తారు.

ప్రభుత్వ బడులకు

ముస్తాబు

రూ.29.79 కోట్ల నిధుల కేటాయింపు ● సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పనతో కొత్త విద్యాసంవత్సరానికి ముస్తాబు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యాన్యువల్ వర్క్‌ప్లాన్ బడ్జెట్ 2024-25 పేరుతో రూ.29.79 కోట్లు కేటాయించిందని సమగ్రశిక్ష ఏపీసీ డి.వెంకటసుబ్బయ్య తెలిపారు. నగరంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలల్లో 19 తరగతి గదుల నిర్మాణానికి ఒక్కో గదికి రూ.5.22లక్షల చొప్పున రూ.99.18 లక్షలు విడుదల అయినట్లు తెలిపారు. జూన్ 12వతేదీ నాటికి పనులు పూర్తి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అలాగే 23 పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణానికి ఒక్కో దానికి రూ.9,37,500 చొప్పున మొత్తం రూ.2.15 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఒక ఎంపీపీ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.95 లక్షలు మంజూరయ్యాయన్నారు. మేజర్ రిపేర్స్ కింద కొండాపురంలోని సాయిపేట ఎంపీపీఎస్ (హెచ్‌డబ్ల్యూ) పాఠశాలకు రూ.6లక్షలు, వడ్డిపాళెం పాఠశాలకు రూ.6లక్షలు మంజూరు చేశారన్నారు. అలాగే విద్యుత్ పునరుద్దణకు పంచేడు ఎంపీపీఎస్ మెయిన్ పాఠశాలకు రూ.1.5లక్షలు, పల్లిపాడు పాఠశాలకు రూ.1.5లక్షలు విడుదలయ్యాయన్నారు. అలాగే 10 కేజీబీవీల్లో ఇంటర్ విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా భవనాలు నిర్మిస్తామన్నారు. ఒక్కో కేజీబీవీలో 6 తరగతి గదులు, 10 మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.2.55 కోట్లు కేటాయించిందన్నారు. ఈ పనులన్నీ వారం రోజుల్లో ప్రారంభమై వేగవంతంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వేసవి సెలవులు పూర్తయ్యే నాటికి మనబడి-మనభవిష్యత్‌కు సంబంధించి పెండింగ్‌లో పనులన్నీ కూడా పూర్తి చేసి పాఠశాలలను సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. అలాగే కేజీబీవీల్లో నిర్మాణ పనులను ప్రభుత్వం రద్దు చేసి సమగ్రశిక్షకే అప్పగించినట్లు తెలిపారు. త్వరలో ఈ పనులను కూడా వేగవంతంగా పూర్తి చేస్తామని ఏపీసీ తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పెంపు

నెల్లూరు(విద్య) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించడగాని, రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ చేసుకోవడానికి ఈ నెల 25వతేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆర్ఐఓ ఎ.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నంలోగా సంబంధిత కళాశాలల్లో ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

ఐదేళ్లు నిండిన వారిని బడిలో చేర్పించండి

ఉదయగిరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు నిండిన ప్రతిఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన, పఠన సామర్థ్యాలను పరిశీలించారు. తిథి భోజనం కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి విద్యార్థులకు మాంసాహార భోజనం అందించడం అభినందనీయం అన్నారు. పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9569
వెండి కిలో ధర	రూ. 98,100
వెండి ఒక గ్రాము	రూ.101.10

న్యూస్ బాక్స్

చలివేంద్రం ప్రారంభం

ఉదయగిరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం వార్డుసభ్యులతో కలిసి సర్పంచ్ పావులూరి సామ్రాజ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వేసవి దృష్ట్యా కార్యాలయానికి వచ్చే ప్రజలు, పట్టణవాసుల దాహార్తి తీర్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముర్తుజా, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, జేవీవీ నాయకులు దస్తగిరిఅహ్మద్, నాయకులు షేక్ యస్థాన్, రియాజ్, గడియాల్చీ యస్థాన్, ఉప్పుటూరి హరి, మాబాషా, జబీవుల్లా, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

అనంతసాగరం ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామిరెడ్డిపాడు ఉన్నతపాఠశాలలో ఇతర పాఠశాలల నుంచి వచ్చి పనిచేస్తూ మంగళవారం రిలీవ్‌వైన ఉపాధ్యాయులు శ్రీనివాసులు రెడ్డి, వెంకటరమణమ్మ, మధుసుదన్ రావును ఎంఈవో 2 ప్రభాకర్‌రెడ్డి, టీచర్లు శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు.కార్యక్రమంలో హెచ్‌ఎం వసుంధరాదేవి, సుబ్బారాయుడు, మనోజ్‌కుమార్, వెంకటరమణ రాజు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

సీతారామపురం , ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఎస్‌ఐ శివకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ బుక్ కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ లేకుండా తిరుగుతున్న ద్విచక్ర వాహనదారులను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై హెల్మెంట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనం నడి పితే రూ.10వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తామన్నారు.

ఈ అభిమానం సల్లగుండ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా నేటికీ గత ముఖ్యమంత్రి జగన్ ఫొటోలు ప్రభుత్వ పథకాల అమలులో కనిపిస్తుండడం గమనార్హం. మండలంలోని ఎండీయూ వాహనాలపై అలాంటి ఫొటోలు యథావిధిగా దర్శనమిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అప్పట్లో వాహనాలు పొందిన ఆపరేటర్లు తమ అభిమానాన్ని చాటుతూ ఫొటోలను తొలగించక పోయినా అధికారులు సైతం మనకెందుకులే అంటూ మౌనం వహించడం పలు అనుమానాలు తావు ఇస్తుంది. నిత్యవసర సరుకుల పంపిణీ సమయంలో రోజుల తరబడి గ్రామాల వైపు ఆ వాహనాలు వెళుతున్నా అవి అధికారులు ఎందుకు కన్పించడం లేదని కొందరు ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎండీయూ వాహనాలపై ఉన్న జగన్ ఫొటోలు

వారానికి రెండు రోజులే గ్రంథాలయం

- శిథిలావస్థలో భవనం
- పాఠకుల ఇక్కట్లు

మర్రిపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రంథాలయ నిర్వహణ పాఠకులను నిరుత్సాహ పరుస్తున్నది. పనివేళల్లో పాఠకులు వచ్చి వార్తాపత్రికలు, వార, పక్ష, మాస పత్రికలతోపాటు,ఇతర గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు చదువుకుంటారు. ఇలా చదివే పలువురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. మర్రిపాడు గ్రంథాలయానికి ప్రతీరోజూ 50మందిపైగా పాఠకులు వస్తుంటారు. 1050మందిపైగా సభ్యులు ఉన్నారు. ఇక్కడ 10మంది కంటే ఎక్కువమంది కూర్చోవటానికి వీలు లేనందున ఎక్కువమంది బయట ఉన్న మర్రిచెట్టు కింద అరుగుపై కూర్చొని పుస్తకాలు చదువుకుంటారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవారికి కూర్చోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడో నిర్మించిన భవనం కావటంతో శిథిలావస్థకు చేరింది. వర్షాకాలం పై కప్పు నుంచి నీరు కారుతుంది. పెచ్చులు ఊడి పడిపోతున్నాయి. దీంతో ఇక్కడున్న ఐదువేల పుస్తకాలను భద్రపరచటానికి గ్రంథపాలకుడు అనేక అవస్థలు పడుతున్నారు. పదేళ్ల నుంచి గ్రంథాలయ



తాళాలు వేసి వున్న గ్రంథాలయ భవనం

భవనం నిర్మించాలని కోరుతున్నా పట్టించుకునేవారులేరు. నాలుగేళ్ల క్రితం డిజిటల్ గ్రంథాలయం అంటూ చెప్పడం మినహా చేసింది శూన్యం. ప్రస్తుత ప్రభుత్వం అయినా నూతన భవనాన్ని నిర్మించేదిశగా ఆలోచించాలని పాఠకులు కోరుతున్నారు. ఇక్కడ రెగ్యులర్ గ్రంథాలయాధికారి లేనందున బుధ, గురువారాల్ల మాత్రమే గ్రంథాలయ తలుపులు తెరుస్తున్నారు. వేసవిలో అనేకమంది గ్రంథాలయానికి వచ్చే అవకాశం ఉన్నా ఇక్కడ పరిస్థితి పాఠకులకు అనుకూలంగా లేదు. కొత్త భవనం నిర్మించి, గ్రంథపాలకుడిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదపుటంచున ప్రయాణం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం బస్టాండ్ సెంటర్ సమీపంలో ప్రయాణాలు సాగించాలంటే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. ఈ ప్రాంతంలో పంట పొలాలకు సాగునీరు అందించే జలాశయానికి చెందిన కాలువ రోడ్డుకు ఆనుకొని ఉండడంతో దీనితో ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వాపోతున్నారు. సిమెంటు రోడ్డు నిర్మాణం ఎక్కువ ఎత్తులో ఉండడంతో ఆ పంట కాలువ కనిపించే పరిస్థితి ఉన్నది. ఈ మార్గంలో నిత్యం ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఉదయగిరికి వస్తుంటారు. పగలు ఎలాగోలా ప్రయాణాలు సాగిస్తున్నా రాత్రి సమయాల్లో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ముందుకు వెళుతున్నారు. వాహనాలు ఎదురుపడిన సమయంతో పాటు రహదారిపై అవగాహన లేనివారు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వినియోగదారుల సమస్యలకు సత్వరమే పరిష్కారం



అర్జీలను పరిశీలిస్తున్న రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి

ఆత్మకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించినట్లు రిటైర్డ్ జడ్జి వీ. శ్రీనివాస ఆంజనేయమూర్తి తెలిపారు. పట్టణంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులు అందజేసిన అర్జీలను పరిశీలించి, సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. మొత్తం మీద 17 అర్జీలు వచ్చాయని, వాటిలో రెండింటిని పరిష్కరించామని మిగిలిన సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించామన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్, సీపీఎం పట్టణ కార్యదర్శి కే. డేవిడ్‌రాజు మాట్లాడుతూ డివిజనల్ పరిధిలో 2000 మంది రైతులు వ్యవసాయ కనెక్షన్లు కోసం దరఖాస్తు చేసుకుని రెండేళ్ల పైబడినా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లు, ఇతర పరికరాలు అందించడంలో అధికారులు విఫలమయ్యారని తెలియజేశారు. ఆత్మకూరులో స్మార్టుమీటర్లు బిగించిన తరువాత రెండుమూడు రెట్లు విద్యుత్ బిల్లుల వస్తున్నాయని, వీటికి సమాధానం ఎవరు చెబుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఐ శ్రీనివాసులు, ఆర్థిక కమిటీ సభ్యులు కే రామోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్‌ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం

సీతారామపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ కృష్ణారెడ్డి తెలి పారు. ఏపీ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా మంగళ వారం జయపు రంలో గ్రామసభ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు క్రయవిక్ర యాలు జరిపిన వెంటనే రెవెన్యూ భూ రికార్డుల్లో హక్కులను నమోదు చేయిం చుకోవాలన్నారు. గతంలో జరిగిన సర్వేలో తప్పులుంటే మళ్లీ జరుగుతున్న రీసర్వేలో సరిచేసుకోవాలని సూచించారు. మండల సర్వేర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో, గ్రామస్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

లక్ష్యం.. పిల్లల సంఖ్య పెంచడం

- ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు చెబుతున్న ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ అధికారులు

ఉదయగిరి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రానున్న విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి చిన్నారులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాల్లోనే వారితో అడ్మిషన్లు చేయించడం, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలలకు మార్పు జరిగేటపుడు అడ్మిషన్లు పక్కకు వెళ్లకుండా చూసుకోవడం వంటి చర్యలు ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే గతంలో డ్రాపౌట్స్ అయిన వారిని తిరిగి ప్రభుత్వ పాఠశాలలకు తెచ్చుకోవడం, ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నారు. అందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల వివరాలు సేకరించి వారందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రవేశాలు పొందేలా చూస్తున్నారు. ఉపాధ్యాయులతో పాటు ఐసీడీఎస్ అధికారులు గ్రామాల్లో ఇంటింటికెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పిస్తున్నారు.

- కిట్ల అందజేత: పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో కిట్ ఇవ్వనున్నారు. ఇందులో పుస్తకాలు, విద్యా సామగ్రి ఉంటాయి. వీటన్నింటి మీద తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.
- ప్రత్యేకతలు ఇవే: ప్రభుత్వ పాఠశాలల్లో



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన, విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత బ్యాగు, దుస్తులు, పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేత, వృత్తి విద్యా బోధన, వ్యాయామ ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ. ప్రైవేటుకు ధీటుగా బోధన చేయడం.

డ్రాపౌట్స్ లేకుండా చర్యలు

అంగన్‌వాడీ చిన్నారులను ప్రాథమిక పాఠశాలల్లోని 5వ తరగతి విద్యార్థులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. పండుగ వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు శ్రీకారం చుట్టనున్నాం.

- షేక్ మస్తాన్‌వలి, ఎంఈవో, ఉదయగిరి

పెరమనలో పౌష్టికాహార పక్షోత్సవాలు



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సునీలత

సంగం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమన అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీడీపీవో సునీలత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థుల సక్సెస్ మీట్



ప్రతిభ కనపరిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కలువాయి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ విద్యార్థుల సక్సెస్ మీట్ జరిగింది. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 977 మార్కులు సాధించిన ఎం.హారిక, 975 మార్కులతో రెండో స్థానం సాధించిన ఎం.మేఘనకు ప్రిన్సిపాల్ షేక్. మహబూబ్ బాషా మొమెంటోలు బహూకరించి అభినందించారు. కళాశాలలో ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణ, కిషోర్, దొరబాబు, సురేష్, శ్రీనివాసులు, రామాంజనేయులు, పెంచలయ్య, కల్పన, సుప్రజ, సౌజన్య పాల్గొన్నారు.

వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి సత్యవాణి

ఆత్మకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వరి కోతలు పూర్తయినందున నేలసారం కోల్పోకుండా అదునుబట్టి ఆరుతడి పంటలైన మొక్కజొన్న, వేరుశనగ, పెసర, మినుము, నువ్వు పంటలను రైతులు సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి పీ. సత్యవాణి తెలిపారు. మండలంలోని వాశిలి గ్రామంలో మంగళవారం భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకుని, సాయిల్ హెల్త్ కార్డులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు పీ. నర్సోగిరావు, సీ. శేషగిరిరావు, పీ. దేవసేనమ్మ, ఎంఏవో కే. కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనం.. ఆపై అరకొర వసతులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు బోయమడగల అంగన్‌వాడీ కేంద్రం సౌకర్యాలు కొరవడటంతో నిర్వాహకులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న కేంద్రానికి చుట్టూరా ప్రహరీ లేదు. ఈ సమస్యతో పిల్లలను అదుపు చేయడం సిబ్బందికి తలకు మించిన భారంగా మారింది. అదీనూ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో దుమ్ము, దూళి కేంద్రంలోకి వస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అద్దె భవనం అయినా శ్లాబు పెచ్చులూడి పడుతుంది. ఏ సమయంలో చిన్నారులకు ఏ ప్రమాదం జరుగుతుందో అని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థ భవనాన్ని అద్దెకు



పెచ్చులూడిన భవనం పైకప్పు స్లాబు

తీసుకోవడంలో ఆంతర్యం ఏమిటో అన్న అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యతో చాలా మంది తమ పిల్లలను కేంద్రానికి పంపేందుకు ఆసక్తి చూపడం లేదు. ఏళ్ల తరబడి ఇలాంటి తంతు కొనసాగుతునా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

హత్య కేసులో నిందితుల అరెస్ట్

- చంపేస్తాడేమో అన్న భయంతో చంపేశారు



నిందితుల వివరాలు తెలుపుతున్న డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పెన్నానదిలో జరిగిన హత్య కేసులో నిందితులను నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను నగర డీఎస్పీ పీ సింధుప్రియ ఆమె కార్యాల యంలో మంగళవారం మీడియాకు వెల్లడించారు. జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన బేల్దారి షేక్ సుల్తాన్(38) మద్యానికి బానిసై పలువురిని బెదిరిస్తూ నగదు దోచుకొని మద్యం సేవించేవాడు. అతను ఈ నెల 16వ తేదీ రాత్రి న్యూకాలనీ సమీపంలోని పెన్నానది వద్ద దారుణ హత్యకు గురయ్యాడు. సుల్తాన్ తల్లి కరిముస్నీసా ఫిర్యాదుతో నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ కే సాంబశివరావు నేతృత్వంలో ఎస్‌ఐలు రెహమాన్, శివయ్య ప్రత్యేక బృందాలతో దర్యాప్తు జరిపారు. న్యూకాలనీకి చెందిన షేక్ సలీం అలియాస్ కలిమ్, ఫైపాడురోడ్డు సింహపురి కాలనీకి చెందిన ఎం నాగరాజును నిందితులుగా గుర్తించి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా హత్య చేయడానికి కారణాలు వెల్లడించారు. మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని సలీంను సుల్తాన్ అడగ్గా అతను లేవని చెప్పాడు. దీంతో సుల్తాన్ అతన్ని బెదిరించడంతో భయపడిన సలీం తన స్నేహితుడు నాగరాజుతో కలిసి సుల్తాన్‌ను హత్య చేయాలని నిర్ణయించాడు. ఈ క్రమంలో 16వ తేదీ రాత్రి కర్రలతో సుల్తాన్‌ను బలంగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులను అరెస్ట్ చేసిన ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐ బీవీ నరసయ్య, హెచ్‌సీ ప్రసాద్, కానిస్టేబుళ్లు రత్నయ్య, సురేంద్రబాబు, మస్తానయ్య, వేణు తదితరులను డీఎస్పీ అభినందించారు.

కోర్టు ఉత్తర్వులతో ఒకరి అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో న్యాయస్థానం ఆదేశాల మేరకు చిన్నబజారు పోలీసులు మంగళవారం మిరియాల వెంకట రమణయ్యను అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఓ మహిళకు ఉద్యోగం ఇప్పిస్తానని నగదు తీసుకొని వెంకట రమణయ్య మోసం చేశారు. ఆ కేసులో ఆయన వాయిదాలకు హాజరు కాకపోవడంతో కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం నెల్లూరు కేంద్రకారాగారానికి పంపారు.

మూడు నెలలుగా ఒక్క కేసు నమోదు కాలేదంటే మార్పు వచ్చినట్టే : ఎక్సైజ్ డీసీ



మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు

బిట్రగుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బీ, సీ కేటగిరీలైన కప్పరాళ్ళతిప్ప, బోగోలు, చెంచులక్ష్మీపురం, సోమేశ్వరపురం గ్రామాల్లో మూడు నెలలుగా నాటుసారా తయారీ, అ మ్మకాలు, రవాణాలాంటి కేసులు నమోదు కాలేదంటే, వారిలో మార్పు వచ్చినట్లేనని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. బోగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎక్సైజ్ అధికారులు దయాసాగర్, శ్రీనివాసులునాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సారారహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న సంకల్పనతో ప్రత్యేక దృష్టి ఉంచిందన్నారు. మండలంలో వచ్చిన మార్పుతో సారారహిత గ్రామాలు ప్రకటిస్తూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎస్సై భోజ్యా, అటవీశాఖ అధికారి సుమన్, ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్, ఎక్సైజ్ ఎస్సై దేవిక, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాల్టా చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

- జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు

ముత్తుకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వాల్టా చట్టాన్ని అతిక్రమించి భూగర్భ జలాలను తోడివేస్తున్న ప్రదేశాలను గుర్తించేందుకు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం పంటపాలెం పంచాయతీ పరిధిలోని కోళ్లమిట్ట సమీపంలో తహసీల్దారు స్వప్నతో కలిసి విజిలెన్స్ సీఐ సుభాన్, వేణుగోపాల్ మూడు చోట్ల తనిఖీలు నిర్వహించారు. వీరి వెంట విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నారు. విద్యుత్ కనెక్షన్‌లు తీసుకున్న విధానం ఒకటైతే వాటిని మరొక విధానంలో వాడుకుంటూ వ్యాపారం చేసే ప్రక్రియలో అక్రమ బోర్లు వేసినట్లు వారు గుర్తించారు. వాల్టా చట్టం ప్రకారం తనిఖీలు నిర్వహిస్తుండగా జిల్లా కేంద్రం నుంచి ఉన్నతాధికారులు నుంచి ఫోన్ కాల్ రావడంతో వెంటనే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. 13మందిపై ఫిర్యాదులుండగా నలుగురికి సంబంధించిన బోర్లుతో పాటు లీజు వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు. మరో రెండు రోజుల్లో మిగిలిన బోర్లు కూడా పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. బోర్లు ఎన్ని, భూమి వివరాలు, విద్యుత్ కనెక్షన్‌న్లు వాటి పేర్ల వివరాలు, భూమిని లీజు ప్రాతిపదికన తీసుకుని భూగర్భ జలాలు అమ్మకాలు చేస్తున్న వారి వివరాలు సమగ్రంగా నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు?

- ఐదు కేజీల సరుకు స్వాధీనం?

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయాలపై సంతపేట పోలీసులు మంగళవారం దాడులు చేసి ఐదుగురు విక్రేతలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సేకరించిన సమాచారం మేరకు... నెల్లూరులోని పెన్నానది పొర్లుకట్ట సమీపంలో గంజాయి విక్రయాలు సాగుతున్నాయన్న సమాచారంతో సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన ఐదుగురు గంజాయి విక్రేతలు పరారవుతుండగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి సుమారు ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	100
స్కిన్ చికెన్	184
స్కిన్‌లెస్	204

కోడిగుడ్ల ధర (100): 420

సీనియర్ సివిల్ న్యాయాధికారికి వీడ్కోలు

కావలిటౌన్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి) : స్థానిక కోర్టులో సీనియర్ సివిల్ న్యాయాధికారిగా విధులు నిర్వహిస్తున్న శోభ కందుకూరుకు బదిలీ అవడంతో మంగళవారం న్యాయవాదులు ఆమెకు వీడ్కోలు సత్కారమందించారు. మాజీ ఏజీపీ పోట్టూరు శ్రీనివాసులు మరికొంతమంది న్యాయవాదులు న్యాయాధికారి చాంబర్‌లో ఆమెకు మొక్కలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాఘవరావు, కోమలి, పవన్, జోసఫ్, అలేఖ్య, మనుధ సిబ్బంది విజయ్‌కుమార్, ప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభకు మొక్క అందిస్తున్న మాజీ ఏజీపీ శ్రీనివాసులు



న్యూస్ బాక్స్

157 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 485 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. 11 కంపెనీ ప్రతినిధులు 328బేళ్లను కొనుగోలు చేశారు. నోబిడ్-137, ఆర్ఆర్-1, సీఆర్-13, జంపింగ్ లాట్స్-6 కారణాలతో 157బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.253.81గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

● మర్రిపాడు : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి రైతులు 663 బేళ్లను తీసుకొని రాగా, 15 కంపెనీల ప్రతినిధులు 463బేళ్లను కొనుగోలు చేశారు. 200 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ.280కాగా, కనిష్ఠ ధర రూ.220గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జీ. రాజశేఖర్ తెలిపారు.

నీటి ట్యాంకు శుభ్రం

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): వెంగళాపురంలో మంగళవారం అధికారులు మంచినీటి ట్యాంకును శుభ్రంగా కడిగించి, బ్లీచింగ్ వేయించారు. టీడీపీ నాయకుడు లోమడ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జే స్రవంతి, ఏఎన్ఎం షేక్ ముబీనాభాను పర్యవేక్షించారు.

భూమిని రక్షించుకోవడం మన బాధ్యత

బిట్రగుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భూమి, నీరు, గాలిని రక్షించుకోవడం మన బాధ్యతని కావలి లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి అన్నారు. బోగోలు మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆవరణంలో మంగళవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ఆయన మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై చైతన్యం రావాలి



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న మాస్టర్ ట్రైనర్ శరత్

దగదర్తి (బిట్రగుంట), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రైతుల్లో ప్రకృతి వ్యవసాయంపై చైతన్యం రావాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ శరత్ అన్నారు. దగదర్తి మండలం చవటపుత్తేడులో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభలో సర్పంచు పీ. కళ్యాణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల వాతావరణ, భూ కాలుష్యాలను నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌డీలు శాంతి, వేణు, చెంచయ్య, మల్లేశ్వరి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి ర్యాలీని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మైనార్టీ నేతలు

బిట్రగుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా బోగోలులో గురువారం నిర్వహించనున్న శాంతియుత ర్యాలీని జయప్రదం చేయాలని జేఏసీ నేతలు షేక్‌నూరుద్దీన్, ఎస్కే. జహీర్ పిలుపునిచ్చారు. బోగోలులో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా బోగోలు కూడలి నుంచి ఇబ్రహీంపేటలోని జామియా మసీదు వరకు శాంతియుత ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ర్యాలీని జయప్రదం చేసేందుకు లౌకికవాదులు, వామపక్ష పార్టీలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు సిరాజ్, మహబూబ్‌బాషా, షేక్‌గౌస్‌బాషా, అహ్మద్‌బాషా, జాఫర్, సయ్యద్ కలీమ్, హబ్బు, తదితరులు పాల్గొన్నారు.

28న మెగా జాబ్‌మేళా

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): ఈనెల 28న స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ తెలిపారు. మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జాబ్‌మేళా బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులందరికీ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14 ప్రముఖ కంపెనీలు ఈ మేళాకు హాజరవుతున్నందున యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగి 19 నుంచి 30 ఏళ్లలోపు వయసు కలిగిన యువతీ యువకులంతా ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు.

వంతెన గోడల్లో వృక్షాలు

● పగుళ్లిస్తున్న నిర్మాణాలు
● పట్టించుకోని అధికారులు



ఆర్వోబీ వంతెన గోడలో నుంచి మొలిచిన చెట్టు




వంతెన పైభాగాన కనిపిస్తున్న చెట్లు

కావలి, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో గోడల్లో మొలిచిన చిన్నచిన్న మొక్కలు పెరిగి పెద్ద వృక్షాలై గోడలు దెబ్బతింటున్నాయి. దీంతో ఎంతో కాలం పటిష్టంగా ఉండాల్సిన ఆ నిర్మాణాలు అనతికాలంలోనే కాలం చెల్లుతున్నాయి. కావలి-ఉదయగిరి రోడ్డులో ఉన్న ఆర్వోబీ వంతెన కోసం నిర్మించిన కాంక్రీట్ గోడలో చిన్నచిన్న మొక్కలు మొలిచాయి. వాటిని ఆదిలోనే తుంచి వేయాల్సింది పోయి అవి పెరిగి పెద్దవై వృక్షాలు లాగా కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. వంతెనక అప్రోచ్‌రోడ్లకు రెండు వైపులా కాంక్రీట్ గోడలలో నుంచి చెట్లు పెరుగుతున్నాయి, వీటివల్ల గోడలు దెబ్బతినటమే కాక అప్రోచ్ రోడ్లలో రాకపోకలు సాగించే ప్రజలకు గోడలలో ఉన్న చెట్లవల్ల ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి గోడలు దెబ్బతినకుండా వాటిల్లో ఉన్న చెట్లను తొలగించి ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కల్పించాలి.

ఆక్రమణలను పట్టించుకోరా!?

● ఆర్‌అండ్‌బీ రోడ్డుపై మురుగునీరు వదులుతున్నా చర్యలు తీసుకోరా..

లింగసముద్రం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతినిత్యం రద్దీగా ఉండే లింగసముద్రంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లను ఆక్రమించినా అధికారులు పట్టించుకోరా.. ? అలాగే రోడ్లపై మురుగు నీటిని వదులుతున్నా చర్యలు తీసుకోరా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యలపై గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు అధికారులకు మొరపెట్టుకుంటున్నా అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదు. లింగసముద్రంలోని గొల్లపాలెం నుంచి కల్యాణ మండపం వరకు రోడ్డు మార్జిన్లను ఆక్రమించి, మట్టి ఎత్తుగా పోశారు.దీంతో రోడ్డు 12 అడుగులు మాత్రమే ఉంది.దీంతో వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. దీంతో ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్ను ఆక్రమించి సిమెంటు రోడ్డుకు ఇరువైపులా వేసిన మట్టి

ముగిసిన పౌష్టికాహార పక్షోత్సవాలు



వలేటివారిపాలెం : పౌష్టికాహరంపై ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ కార్యకర్తలు



కొండాపురం : బాలింతలకు పౌష్టికాహారం అందచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు మమత, శ్రీదేవి, వరమ్మ తదితరులు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో మండలంలోని శాఖవరంలో జరుగుతున్న పౌష్టికాహార పక్షోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత ప్లకార్డులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యకర్తలు మమత, రంగమ్మ, పద్మ, టీచరు శ్రీనివాసులు తదితరలు పాల్గొన్నారు.

కొండాపురం, (ఆంధ్రజ్యోతి): పోషణ్ పక్వాడలో భాగంగా ఐసీడీఎస్ ద్వారా జరుగుతున్న పౌష్టికాహార పక్షోత్సవాలు మంగళవారం ముగిశాయి. సాయిపేట పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఈకార్యక్రమంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం బాలసంజీవిని కిట్లను అందచేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు మమత, శ్రీదేవి పాల్గొన్నారు.

మాచవరంలో ఎమ్మెల్యే ఇంటూరి ఆకస్మిక తనిఖీలు



మాచవరం సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామ సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన హాజరు పట్టికలను పరిశీలించారు. ప్రజలకు అందాల్సిన సేవలు సకాలంలో అందుతున్నాయా లేదా..? అని ఆరాతీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యలపై తక్షణం స్పందించాలని, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాల ఫలాలు అర్హులందరికీ అందేలాచూడాలని, సమయపాలన పాటించాలని నిర్దేశించారు. అనంతరం సచివాలయ సిబ్బంది, పీహెచ్‌సీల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు అడిగి తెలుసుకోవటంతోపాటు పనితీరులో మార్పుచేసుకోవాల్సిన అవసరాన్ని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'సదరన్' వెరిఫికేషన్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



ఏరియా వైద్యశాల వైద్యాధికారులకు వినతిపత్రం ఇస్తున్న మండవ వెంకట్రావు

కావలి, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): సదరన్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కేంద్రాల్లో దివ్యాంగులకు నీడ, కూర్చునేందుకు బల్లలు వసతితోపాటు రవాణా చార్జీలు, భోజన వసతులు కల్పించాలని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన కావలి ఏరియా వైద్యశాలలో వైద్యాధికారులకు వినతిపత్రం అందచేశారు. గతంలో దివ్యాంగుల వసతులపై ఆయన సీఎంవో ఆఫీస్‌కు లెటర్ పెట్టగా వారు వెంకట్రావు కావలి అడ్రస్‌లో ఉండటంతో కావలి ఏరియా వైద్యశాలకు ఆ వివరాలు పంపి వసతులు కల్పించమని కోరారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య ఉంటే ఒక్క కావలిలోనే వసతులు సమకూర్చటం ఎలా కుదురుతోందని వైద్యశాల వారు వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన రాష్ట్రవ్యాప్తంగా సదరన్ కేంద్రాల్లో దివ్యాంగులకు వసతులు కల్పించాలని కోరుతూ ఆ లెటర్‌ను ఏరియావైద్యశాల ద్వారా సీఎంవో ఆఫీస్‌కు పంపమని కోరారు. కార్యక్రమంలో ఏరియావైద్యశాల సూపరింటిండెంట్ పద్మావతి, ఆర్ఎంవో ప్రమీల, డీఆర్‌డీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పగిలి మంచినీరు వృథా



లింగసముద్రం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని మీసేవ కేంద్రం పక్కనే ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తున్నది వర్షపు నీరు మాత్రం కాదండోయ్... విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసేందుకు ట్రాక్టర్‌కు ఉన్న యంత్రంతో గుంత తీస్తుండగా అంతర్గత మంచినీటి పైపు తగిలి పగిలి వృథాగా పోతున్న మంచినీరు ఇది. మంగళవారం సాయంత్రం కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు కాంట్రాక్టరు ఆయన సిబ్బంది యంత్రంతో గుంతలు తీస్తున్నారు.దీంతో లింగసముద్రం గ్రామానికి మంచినీటిని అందించే పైపులైన్ తగిలి పగిలింది. దీంతో భారీ స్థాయిలో నీరు రోడ్డుపై వృథాగా పోతోంది.దీంతో సిబ్బంది గ్రామానికి నీటి సరఫరాను నిలుపుదల చేశారు.సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



డాక్టర్ ప్రభాకర్‌నాయుడును సత్కరిస్తున్న అపోలో వైద్యులు ప్రజా సంఘాల నేతలు

కావలిటౌన్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ప్రభాకర్ నాయుడు ఆసుపత్రిలో మంగళవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు జరిగింది. నెల్లూరు అపోలో వైద్యశాల సీనియర్ అంకాలజిస్ట్ హరిత, ప్రముఖ క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు జీవీవీ ప్రసాద్‌రెడ్డి పాల్గొని క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. దగ్గు చెస్ట్ పెయిన్, ఊపిరాడకపోవడం, బ్లోటింగ్, బ్లీడింగ్, గడ్డలు, కడుపు నొప్పి, వెన్ను నొప్పి, బరువు తగ్గడం, మల విసర్జనలో మార్పులు తదితర లక్షణాలతోపాటు జీవనశైలిలో మార్పులు, పొగతాగడం, మద్యం సేవించడం, స్థూలకాయం వల్ల కూడా క్యాన్సర్ రావచ్చన్నారు. ఈ లక్షణాలతో బాధపడేవారు వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్‌నాయుడు పేదలకు అందిస్తున్న ఉచిత వైద్యసేవలకుగాను అపోలో వైద్యులతోపాటు స్వచ్ఛంద సంఘాల నాయకులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష, ప్రసాదరావు, అజిత్‌బాబు, సలీంబేగ్, రాయపాటి దిలీప్, శారద, దాసు, ఘనీబాష, జమీర్ స్వచ్ఛంద సంస్థల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం గేటువద్ద ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కందుకూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలను తక్షణం చెల్లించాలని, మున్సిపాలిటీలో పెరిగిన జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్యను పెంచాలని, పారిశుధ్య కార్మికులకు రావాల్సిన కనీస వసతులను అందించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్యేతర పనులకు కార్మికులను వినియోగించటం ఆపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కే. అనూషకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు బూసి సురేష్‌బాబు, వై. ఆనంద్ మోహన్, ఎస్ఏ గౌస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా జలదంకి బైపాస్ పనులు

● పూర్తయిన వంతెనలు ● ఇక మిగిలింది తారురోడ్డు నిర్మాణమే

జలదంకి, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి పడమటి వైపున కమ్మపాలెం మీదుగా బైపాస్ రోడ్డు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఈ రోడ్డు నిర్మాణంలో చిప్పలేరు వాగు, గౌరవరం మేజర్ కాలువ, ఏటికాలువ, లేదూటగంగమ్మ చెరువు వరవకాలువలపై వంతెనల నిర్మాణాలు పూర్తయ్యాయి. కొత్తగా నిర్మించే ఈ రోడ్డుపై మెటల్ పనులు పూర్తికాగా ఇక మిగిలింది తారు వేయడమే. దాదాపు 90శాతం పనులు పూర్తికాగా మిగిలిన పదిశాతం పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం జలదంకి మీదుగా వాహనాలు వెళ్తుండగా, తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బైపాస్‌రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆ ఇబ్బందులు తొలగనున్నాయి.



చిప్పలేరు వాగుపై పూర్తయిన వంతెన



జలదంకి బైపాస్ రోడ్డుపై తారు వేసేందుకు సిద్ధం చేసిన మెటల్

దివ్యాంగుల పాఠశాల సందర్శన



దివ్యాంగుల పాఠశాలలో చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న సబ్‌కలెక్టరు శ్రీపూజ, కుటుంబసభ్యులు

కందుకూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలను సందర్శించారు. ఆమె తీసుకెళ్లిన పెన్సిళ్లు, పెన్నులు, పుస్తకాలు, ఆటవస్తువులను దివ్యాంగులందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులను పరిశీలించటంతోపాటు పాఠశాల అభివృద్ధికి ఎలాంటి సహకారం కావాలన్నా సంప్రదించాలని తెలిపారు. వారికి మెరుగైన సదుపాయాలు, భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

వలేటివారిపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : రైతులంతా తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి హేమంత్‌భరత్ కుమార్ తెలిపారు. మండలంలోని కొండసముద్రంలో మంగళవారం భూసారపరీక్షలు ప్రాముఖ్యత, పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఏడాది 735 మట్టి నమూనాల పరీక్షలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ నెలాఖరు వరకు గ్రామాల్లో మట్టి నమూనాలు సేకరించనునట్లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఉద్యాన, వ్యవసాయశాఖ సమాయకులు సురేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.



నట్టింట్లో 'సాగర గర్భం'

- ఆకట్టుకుంటున్న అక్వేరియం అందాలు
- రంగు రంగుల చేపలతో ముచ్చట్లు
- పెద్దలకు మైండ్ రిలీఫ్, పిల్లలకు ఆటవిడుపు

నీలిరంగు సముద్రం.. అందులో విహరించే అందమైన చేపలు... సహజసిద్ధంగా వీటిని చూడాలనుకుంటే అక్వేరియంతోనే సాధ్యం. అయితే ఇదీ అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. ప్రకృతిపై ప్రేమ, చేపలను సాకాలన్న తపన ఉండాలి. ఒకప్పుడు అరుదుగా కొంతమంది ఇళ్లలోనే చేపలను పెంచేవారు. ఇప్పుడు అలా కాదు.. ఆక్వేరియాలు నట్టింట్లో పెట్టుకోవడం బాగా పెరిగింది. పెద్దలకు మైండ్ రిలీఫ్‌గా ఉంటుందని, పిల్లలకు ఆటవిడుపుగా ఉంటాయని ఆక్వేరియాల్లో అందమైన చేప పిల్లలను కడుపున పుట్టిన బిడ్డల్లా సంరక్షిస్తున్నారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)

ప్రకృతిని ఆస్వాదించే జంతుప్రేమికులు కుక్కలు, పక్షులు, పావురాళ్లు, కుందేళ్లు, తాబేళ్లను పెంచుకోవడం మనం చూస్తుంటాము. వీటికన్నా చాకిరీ ఎక్కువైన అక్వేరియం (గాజు తొట్టి) పెట్టి అందులో వివిధ రకాల చేపలను కన్నబిడ్డల్లా సంరక్షించడం ఒకప్పుడు అరుదుగా ఉండేది. కాలక్రమీణా చేపలను పెంచేవారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. కరోనా తరువాత ఈ అభిలాష మరింత పెరిగింది. ఇంట్లో పెద్దలకు ఆక్వేరియంలో చేపలను చూడగానే కాస్త మైండ్ రిలీఫ్‌గా ఉంటుందని, పిల్లలకు ఆటవిడుపుగా ఉంటాయని, పైగా నడింట్లో సాగర గర్భమే ఉందన్న ఫీలింగ్‌తో మరికొందరు ఆక్వేరియం ఏర్పాటు చేసుకుంటున్నారు. గాజు కుండీల మొదలు అడుగు, రెండడుగులు, 3, 4 అడుగులు ఇలా కావాల్సిన సైజుల్లో ఆక్వేరియాలు తయారు చేసుకుని అందులో అందమైన వింత, విచిత్రాలు కలిగిన ఆకట్టునే అనేక రకాల చేపలను ముచ్చటపడి మరీ పెంచుకుంటున్నారు. ఖర్చు ఎంతైన లెక్క చేయని ప్రకృతి ప్రేమికులు అందమైన ఆక్వేరియం ఉండాలన్న కాంక్షతో చేపలు పెంచేందుకు సిద్ధమవుతున్నారు. ఇళ్లలోనేకాదు.. హస్పిటల్, పారిశ్రామిక కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు తదితర ప్రాంతాల్లోనే ఆక్వేరియాలు ఏర్పాటు చేస్తున్నారు.

● అందమైన చేపలతో ఆకర్షణ

మలేషియా, థాయ్‌లాండ్ సంతతికి చెందిన ఫ్లవర్‌హార్న్ (వాస్తుచేప) చేపలు ఒకే ఆక్వేరియంలో మగ, ఆడ చేపలుంటాయి. పూర్తి హైబ్రీడ్ జాతితో తయారైన వీటి జీవితకాలం 7 నుంచి 30 ఏళ్ల. రూ. 1000 నుంచి 7 వేల వరకు ధర పలికే ఈ చేపలు మనతో కలిసి ఆడుకోవడం, స్నేహ స్వభావంతో ఉండటం ప్రత్యేకత. స్వదేశీ సంతతికి చెందిన టైగర్ బార్బ్ జాతి చేపలు తొలుత తెలుపు రంగుతో ఆవిర్భవించి తాజాగా గ్రీన్, గ్రీన్‌పైన ఎరుపు, బ్లాక్ రంగులతో ఆకర్షణీయంగా రూపాంతరం చెందాయి. జత రూ.200 నుంచి సైజును బట్టీ ధర పలుకుతున్నాయి. మూడేళ్లపాటు వీటి మనుగడ ఉంటుంది. చైనాలో పురుడు పోసుకున్న అరవాన చేప థాయ్‌లాండ్, మలేషియాలో బ్రీడింగ్ చేసుకుని అందమైన ఆకృతిల్లో లభిస్తుంది. చైనీయులకు అత్యంత సెంటిమెంట్ కలిగిన ఈ జాతి రూ. 1500 నుంచి రూ. 15 లక్షల వరకు కూడా ధర పలుకుతుంది. ఇక ఏంజెల్, గోల్డ్, మాలి, టెట్రాన్, కోయ్‌కార్ప్ వంటి జాతులకు చెందిన చేపలను ప్రకృతి ప్రియులు ఎక్కువగా పెంచు తుంటారు.

● కరోనా తరువాత ఎక్కువగా..

కరోనా విపత్తు తరువాత చేపల పెంపకంలో భారీ సంస్కరణలు చోటుచేసుకున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. పాతతరం చేపల నుంచి క్రాస్ బ్రీడింగ్‌లతో సరికొత్త జాతులను సృష్టించారు. ఒక్కో జాతి చేప నుంచి సుమారుగా 12 రకాల హైబ్రీడ్ జాతులను వృద్ధి చేశారు. చేపల రంగులూ మారాయి. వాటిల్లో ఆకృతులు మారడంతో చేపలు పెంచుకునే వారి సంఖ్య మనసీయంగా పెరిగింది. విదేశాల్లో జెనిటికల్ బ్రీడింగ్ చేసిన చేపల పిల్లలను చెన్నై, కోల్‌కతా వంటి మహానగరాలకు తీసుకువచ్చి అక్కడ నుంచి నెల్లూరుకు దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు.

ఇంటికి అందం తెచ్చేవిగా..

రూ.కోట్లు ఖర్చు చేసి ఇల్లు కట్టినా, రూ. క్షలు వెచ్చించి ఫర్నీచర్ పెట్టినా రాని అందం నడింట్లో చేపలతో ఆక్వేరియం పెడితే వస్తుందని నమ్ముతున్న వారు అనేకం. వీరి కోసం ఆక్వేరియాలు తయారు చేసే సెంటర్లు ఇప్పుడు నెల్లూరులో అనేక చోట్లు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు ఒకటి రెండు కేంద్రాలతో సరిపెట్టుకుని, పెద్దవి కావాలంటే చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల నుంచి తెచ్చుకునే వాళ్లం. కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా నగరంలోని తయారీ కేంద్రాలు వచ్చాయి. మనం ఏ సైజు కావాలో చెబితే ఆ సైజులో ఆక్వేరియాలు చేసి ఇస్తున్నారు. ఇల్లు నిర్మించుకునే సమయంలో లేదా కొత్తఇల్లు కొనేటప్పుడో ఆక్వేరియానికి స్థలం కేటాయించేస్తున్నారు. అంతగా చేపల సాగు సగటు వ్యక్తి జీవనంలో భాగమైంది.



వారి సంఖ్య బాగా పెరిగింది

గతంలో కంటే ఇప్పుడు ఇళ్లలో ఆక్వేరియాలు పెట్టుకునే వారి సంఖ్య ఘననీయంగా పెరిగింది. మా లెక్కప్రకారం కరోనా తరువాత చేపలను ఇళ్లలో పెంచడం అందరికీ అలవాటుగా మారింది. పెద్దలకు కాస్త మైండ్ రిలీఫ్‌గా ఉంటుందని, పిల్లలకు ఆడుకునే వీలు ఉంటుందని చెబుతున్నారు. ఆర్డర్లు ఇచ్చి మారీ చేయించుకుంటున్నారు. ఎవరూ ఖర్చుకు వెనకడుగు వేయడం లేదు.

- ఎస్డీ మీర్ జమీర్‌హుస్సేన్, ఆక్వేరియం తయారీదారుడు



ఆ అనుభూతి మాటల్లో చెప్పలేం

మా ఇంట్లో పదహారేళ్లగా ఆక్వేరియం పెట్టి చేపలను పెంచుతున్నాను. చేపలంటే నాకు చాలా ఇష్టం. పిల్లలకు చేపలతో ఆడుకోవడం ఇష్టం కాబట్టి ఇంట్లో ఆక్వేరియం పెట్టుకున్నాము. వాటితో ఉండే అనుభూతిని మాటల్లో చెప్పలేము.

- పీ శకుంతల, నెల్లూరు



నిర్వహణ కష్టమే అయినా

ఇంట్లో ఆక్వేరియం పెట్టుకుని నిర్వహించడం చాలా కష్టం. కానీ చేపలతో ఉండే అనుబంధం ఆ కష్టాన్ని గుర్తుచేయదు. ఇంట్లో పెంచుకునే చేపలు మనలో ఓ భాగమైపోతాయి. ఉదయం, సాయంత్రం వాటికి ఫుడ్ వేయడం, తరచూ నీళ్ల మార్చడం వంటివి అలవాటుగా మారుతుంది.


- కోడూరు శేషారెడ్డి, అల్లీపురం



కోయికార్







రంగురంగుల టేట్రా



టైగర్‌బార్బ్



ఏంజిల్స్



ఫ్లవర్‌హార్న్ రకం చేప

పరిశ్రమలకు త్వరగా అనుమతులివ్వండి

● ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నూతనంగా పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో మంగళవారం జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన భూసేకరణ, మౌలిక వసతుల ఏర్పాటు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ప్రింటింగ్, రెడీమేడ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలశాఖ జీఎం ప్రసాద్, డీఎఫ్‌వో మహబూబ్ బాషా, కాలుష్య నియంత్రణ శాఖ ఈఈ అశోక్‌కుమార్, ఏపీకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు కలువాయి ఎస్ఐ

కలువాయి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఐ సుమన్‌ను ఉన్నాతాధికారులు మంగళవారం వీఆర్‌కు పిలిపించారు. ఎస్ఐపై పలు ఆరోపణలు నేపథ్యంలో ఉన్నాతాధికారులు ఈ విధమైన చర్యలు తీసుకున్నట్లు సమాచారం. మంగళవారం సాయంత్రం కలువాయికి ఇన్‌చార్జిగా కండలేరు ఎస్ఐ రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు.

25న కారాగారంలో మామిడితోట వేలం

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారములో ఉన్న 104 మామిడి చెట్ల కాయలు, పండ్లను కోసుకునే హక్కు కోసం ఈ నెల 25వ తేదీ వేలం పాట నిర్వహిస్తున్నట్లు నెల్లూరు కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారి సోపిరాల వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ వేలములో పాల్గొనే వారు 25వ తేదీ ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ధరావతు సొమ్ము చెల్లించి టోకెన్ పొందాలని కోరారు. పంట దక్కించుకున్న వారు వెంటనే మొత్తం పైకాన్ని చెల్లించి మామిడి తోటను స్వాధీనం చేసుకోవచ్చన్నారు. పంట కాలం ముగిసే వరకు తోట కాపలా, రక్షణ బాధ్యతలు వారే చూసుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం వాటిల్లితే జైళ్ల శాఖ బాధ్యత వహించదని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు 9885234850, 9000990587 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పక్కన సూపరింటెండెంట్ సిద్ధానాయక్

సోమశిలలో 51.585 టీఎంసీల నిల్వ

అనంతసాగరం ఏప్రిల్ 22 ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి 51.585 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 1,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రేపు హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏబీఎం బాలికోన్నత పాఠశాల మైదానంలో గురువారం పురుషుల హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఎన్ విక్టర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆ రోజు సాయంత్రం 3 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు అన్నమయ్య జిల్లా కదిరిలో త్వరలో జరిగే 54వ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

జీజీహెచ్‌లో అజెండాపై రగడ

● తమ సలహాలు తీసుకోలేదంటూ సభ్యుల ఆగ్రహం ● కలెక్టర్ ఆగ్రహం.. పలు అంశాలపై సమీక్ష

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో అజెండా రూపకల్పనపై సభ్యులు అగ్రహం వ్యక్తం చేశారు. అజెండా తయారీలో తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ కమిటీ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, సభ్యుడు మొగరాల సురేష్ కమిటీలో కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు. అజెండా తయారీలో తమ వంతు సలహాలు ఇచ్చే వారమని, తామేమైనా పనిలేకుండా వచ్చామా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రికి అవసరమైన నిధుల సమీకరణలో తమ వంతు కృషి చేస్తామని వెల్లడించారు. కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జీజీహెచ్‌లో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సూపరింటెండెంట్ సిద్ధానాయక్‌ను కలెక్టర్ నిలదీశారు. ఇది సీక్రెట్ సమావేశం కాదని వారికి స్వయంగా లేదా మెయిల్‌లో అజెండా కాపీని పంపాలని సూచించారు. ఇక కరోనా సమయంలో వాహనాల ఏర్పాటుకు ఇవ్వాల్సిన బకాయిలు ఇప్పుడు అజెండాలో ఎందుకు పెట్టారని అధికారులను నిలదీశారు. ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోల అవసరాలపై కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ సిబ్బందిని ఎందుకు వీటికి ఉపయోగించుకుంటు న్నారని ప్రశ్నించారు. దీనికి సూపరింటెండెంట్ మాట్లాడుతూ తాను ఆసుపత్రికి 110 మంది ఎఫ్ఎన్‌వోలు, ఎంఎన్‌వోలు కావాలని డీఎంఈకి లెటర్ కూడా పెట్టామని, ఇంత వరకు అనుమతులు ఇవ్వలేదని వివరణ ఇచ్చారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ తమకు వైద్య పరికరాలు కావాలని, ఏసీలు సరిగ్గా లేవని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇలా అజెండాలో పొందుపరిచిన 11 అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఆసుపత్రిలో నిధులను బట్టి వాటిని కొనుగోలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు బ్రహ్మరెడ్డి, అబిదాసుల్తానా, ఏసీసుబ్బారెడ్డి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌మన్నార్, డీఎంహెచ్‌వో సుజాత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారాన్ని అందించాలి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారాన్ని అందించి వారి ఎదుగుదల కు తోడ్పడాలని కలెక్టర్ ఆనంద్ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ శంకరన్ హాల్లో పౌష్టికాహార పంపిణీపై ఐడీసీఎస్ అధికా రులతో సమావేశం నిర్వహించారు. అంగన్ వాడీలకు వచ్చే పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతీనెలా పిల్లల ఎత్తు, బరువు సక్రమంగా చూసి రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్ పోస్టులను త్వరగా భర్తీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో సమీక్ష

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి) : యూనివర్సిటీలో మంగళవారం సీడీసీ విభాగం ఆధ్వర్యంలో అనుబంధ కళాశాలల కరస్పాండెంట్స్, ప్రిన్సిపాళ్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు పాల్గొన్నారు. విద్య ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల ప్రగతి, పరీక్షల నిర్వహణ, అధ్యాపకుల శిక్షణపై విశ్లేషణ్మాతకంగా చర్చించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి మధుమతి, కరస్పాండెంట్స్ ప్రిన్సిపాల్స్ తదితరులున్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయండి

● పనితీరు మెరుగుపరుచుకోండి : ఎస్ఈ

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఉద్యోగులు, సిబ్బంది పటిష్ట చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ అధికారులను ఆదేశించారు. ఆయన కార్యాలయం నుంచి మంగళవారం జిల్లాలోని డీఈలు, ఏఈలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేం దుకు ఉద్యోగులు, సిబ్బంది పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఎక్కడైనా అంతరాయాలు ఎక్కువగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోలార్ విద్యుత్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. గృహాల్లో విద్యుత్ వాడకం పెరిగిపోతోందని, దీనికి సంబంధించి అదనపు లోడ్‌ను గుర్తించి, 50శాతం సబ్సిడీతో క్రమబద్ధీకరిం చాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే వెంటనే సమాచారం ఇచ్చేందుకు ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు స్థానిక లైన్‌మన్ ఫోన్ నెంబర్ రాసి ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో సూర్యఘర్ నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర, డీఈఈ మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● కలెక్టరేట్ ఎదుట ధర్నా

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఆ ఉద్యోగులు మంగళవారం ధర్నా చేశారు. ఆయు ష్మాన్ ఆరోగ్య మందిర్‌కు చెందిన ఏపీ మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు చెందిన వారు ఈ ధర్నా చేపట్టారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్, ప్రధాన కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకం నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్‌ను పునరుద్ధరించాలని, ఆసుపత్రుల అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపా ధ్యక్షుడు అదిత్, సంయుక్త కార్యదర్శి రెబికా, సుమాంజలి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో జైలు, జరిమానా

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం చేశాడన్న కేసులో నేరం రుజువు కావడంతో గరితోటి విజయ్ కుమార్ అనే నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ నెల్లూరు నగర 5వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ గండికోట దేవిక మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరులోని జనశక్తి నగర్‌కు చెందిన మంచూరి కనకమ్మ ఇంట్లో 2018 నవంబరు 15న మూడు సవర్ల బంగారు సరుడు, మూడు సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. బాధితురాలి ఫిర్యాదుతో వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. విచారణ కాలంలో నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

కోన బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి : ఆర్డీవో




అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో నాగసంతోషిని అనూష

రాపూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మే 8 నుంచి 14 వరకు జరిగే పెంచలకోన బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీవో నాగ సంతోషిని అనూష తెలిపారు. మంగళవారం కోనలోని కమ్మ కల్యాణసత్రంలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు చేస్తున్న ఏర్పాట్లపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతామని ఆమె తెలిపారు. సమావేశానికి ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి అధ్యక్షత వహించారు.

● భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

వేసవిదృష్ట్యా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆర్డీవో ఆదేశించారు. చుట్టుపక్కల జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, ఆ మేరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రానికి వచ్చే రహదారులను పూర్తి స్థాయిలో కట్టడి చేయాలని, అవసరమైనచోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మరోసారి బ్రహ్మోత్సవాలపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆ సమావేశంలో బ్రహ్మోత్సవాలపై పూర్తి అవగాహన వస్తుందన్నారు. అటవీ ప్రాంతంలో చిరుత సంచారం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖా ధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, రాపూరు సీఐ సత్యనారాయణ, అటవీశాఖ రేంజి అధి కారి రవీంద్రబాబు, తహసీల్దార్ లక్ష్మీ నరసింహం, ఎంపీడీవో భవాని, ఆర్టీసీ డీఎం అనీల్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెరగని ధరలు... పొగాకు రైతు ఆందోళన



కలిగిరిలోని వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు

కలిగిరి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి గత మూడేళ్లుగా రైతులకు పరిస్థితులు అనుకూలించడంతో పొగాకుకు రికార్డు ధరలు దక్కాయి. దీనికి తోడు బోర్డు కూడా గతేడాది నుంచి అధిక ఉత్పత్తికి అనుమతులివ్వడంతో గతేడాది కన్నా ఈ ఏడాది ఎక్కువమంది పొగాకు సాగుకు మొగ్గుచూపారు. కొనుగోళ్ల ప్రారంభమై నెల దాటుతున్నా గరిష్ఠ ధరలో మార్పు లేకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. రోజువారి కొనుగోళ్లలో 400కిపైగా బేళ్ల వేలం కేంద్రానికి వస్తున్నా వాటిలో 10నుంచి 20శాతం బేళ్లకు కూడా గరిష్ఠ ధర అందటం లేదని రైతులు పేర్కొన్నారు. అదేవిధంగా లోగ్రేడ్ పొగాకును కంపెనీలు కొనుగోలు చేయకపోవడంపై వారు ఆందోళన చెందుతున్నారు.

● ఉత్పత్తి పరిమితి పెంపు

2024-25 పంట కాలానికి పంట ఉత్పత్తి పరిమితిని గణనీయంగా పెంచారు. నెల్లూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లోని 11వేలం కేంద్రాల పరిధిలో 103మిలియన్ కిలోలుగా నిర్ధారించారు. ఎస్ఎల్ఎస్(దక్షిణాది తేలికనేలలు) పరిధిలోని కలిగిరి, డీసీపల్లి, కందుకూరు-1,2, పొదిలి, కనిగిరి వేలంకేంద్రాల్లో ఈ ఏడాది 56మిలియన్ కిలోలకు అనుమతినిచ్చారు. కలిగిరి వేలం కేంద్రంలో ఈ ఏడాది 8మిలియన్ కేజీల పొగాకు దిగుబడి అంచనా వేయగా, ఇప్పటివరకు ఒక మిలియన్ పొగాకు కొనుగోళ్ల పూర్తయినట్లు బోర్డు అధికారులు పేర్కొన్నారు.

గతేడాది రికార్డుస్థాయిలో పొగాకు ధరలు పెరగడంతో ఆ ప్రభావం ఈ ఏడాది సాగుపై పడింది. భూమికౌలు, బ్యారన్‌కౌలు, కట్టె ఖర్చు, పచ్చాకు ముఠా కూలీలు అమాంతం పెరిగిపోయాయని, ధరలు పెరుగుతాయని ఎదురుచూస్తున్నా, గరిష్ఠ ధరలో పెరుగుదల లేదని రైతులు పేర్కొన్నారు. ధరలు పెరిగేటట్లు చూడటంతో పాటులో గ్రేడుపొగాకు కొనుగోళ్ల చేసేలా బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ముగిసిన పోషణ్ పక్వాడ

రాపూరు, ఏప్రిల్, 22 (ఆంధ్రజ్యోతి): పోషణ్ పక్వాడ ముగింపు కార్యక్రమం మంగళవారం ఏపూరు పంచాయతీలో ఐసీడీఎస్ సీడీపీవో సునంద ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బిడ్డకు మొదటి వెయి రోజులు ఎలాంటి ఆహారం ఇవ్వాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి లబ్ధిదారులకు అందుతున్న సరుకులు ఎలా వినియోగించుకోవాలో తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీసులోచన పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9569
వెండి కిలో ధర	రూ. 98,100
వెండి ఒక గ్రాము	రూ.101.10

న్యూస్ బాక్స్

మెగా పేరెంట్స్ డే

రాపూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బొజ్జనపల్లిలోని ఎంపీపీ స్కూల్‌లో మంగళవారం మెగా పేరెంట్స్ డే నిర్వహించినట్లు హెచ్‌ఎం. హజరత్తయ్య తెలిపారు. ఈ సందర్భంగా పిల్లల ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను తల్లిదండ్రుల సమక్షంలో అందచేశారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ నాగేంద్ర, వైస్ చైర్‌పర్సన్ లక్ష్మమ్మ, సహోపాధ్యాయులు వరప్రసాద్‌గుప్తా పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మనుబోలు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల ఆటో కార్మికసంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. సీఐటీయూ నాయకులు నెల్లూరు యాదగిరి, అల్లూరు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా జడ శివ, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, సహాయకార్యదర్శిగా ఎస్‌కే.బీని ఉన్నారు. అనంతరం మాజీ అధ్యక్షుడు మృతిపై మౌనం పాటించి నివాళులర్పించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

కొడవలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కృషి చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పార్టీ గ్రామ కమిటీని శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడిగా ఎస్‌కె.జిలానీబాషా, ఉపాధ్యక్షురాలిగా కోవూరు జానకి ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు కోవూరు వెంకీ, దాసరి పవన్, రఫీ పాల్గొన్నారు.

115 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో మంగళవారం జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలో 115 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి మధుమతి ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 1,725 మంది విద్యార్థులకుగాను 1,610 మంది హాజరయ్యారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం

● శ్రీహరి, ఎంపీడీవో బుచ్చిరెడ్డిపాలెం,



బుచ్చిరెడ్డిపాలెం, ఏప్రిల్22(ఆంధ్ర జ్యోతి): వేసవి దృష్ట్యా గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్య తీసుకుంటామని ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు.

? ఏ గ్రామాల్లో సమస్య ఉంది.

! నాగాయగుంట, అనంత నారాయణపురం, పోలినాయుడు చెరువు, పాతకొండూరుపాళెంలో తాగునీటి సమస్య తీవ్రంగా వుంది. పెన్నా పరివాహక తీర ప్రాంతంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే భూగర్భ జలాలు కొంతమేర తగ్గాయి.

? ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటారా?

! నాగాయగుంట, అనంతనారాయణపురం, పోలినాయుడు చెరువు గ్రామాల్లో సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అదనపు నిధులు మంజూరు చేయించింది. వీటితో 2బోర్లు ఏర్పాటు చేశాం. పైపులైన్లు పొడిగింపు చర్యలు తీసు కుంటే సమస్య పరిష్కారం అవుతుంది. అలాగే పాత కొండూరు పాళెంకు రూ.3లక్షలు కేటాయించడంతో నీటి సమస్యను పరిష్కరిస్తాం.

? చేతిపంపులూ పనిచేస్తున్నాయా?

! మండలంలోని గ్రామాల్లోని 70 చేతిపంపులకు మరమ్మతులు చేయించి వాడుకలోకి తెచ్చాం. అలాగే పెన్నా పరీవా హక ప్రాంతాల్లోని కొన్ని గ్రామాల్లో భూగ ర్భ జలాలు అడుగంటిపోయాయి. ఈ గ్రామాల్లో కొత్తబోర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

జోరుగా క్రికెట్ బెట్టింగ్!?

● కసుమూరులో రూ.లక్షల్లో పందేలు ● రూ.లక్షలు పోగొట్టుకుంటున్న యువత



కసుమూరు గ్రామంలోని ప్రధాన వీధి

వెంకటాచలం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రారంభమై నెల కావస్తుంది. అయితే పల్లెల్లో భారీ ఎత్తున బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ప్రధాన పట్టణాల నుంచి పల్లెల వరకు ఈ జూదం పాకిపోయింది. కొందరు వ్యక్తులు ఇదే ప్రధాన వ్యాపారంగా చేసుకున్నారు. ముఖ్యంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరులో రూ.లక్షల్లో పందేలు నడుస్తున్నాయి. అలాగే సర్వేపల్లి, చెముడుగుంట, కాకుటూరు, వెంకటాచలం, నిడిగుంటపాళెం, గొలగమూడి, గూడ్లూరువారిపాళెం, పూడిపర్తి, కనుపూరులో గుట్టుగా క్రికెట్ బెట్టింగ్ సాగుతోంది. పోలీసులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రతిరోజూ రూ.లక్షల్లో బెట్టింగ్ సాగుతోందని సమాచారం. ప్రధానంగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని పందేల వ్యవహారం నడుస్తోందని సమాచారం. ఈ క్రమంలోనే పలువురు యువకులు బెట్టింగ్‌లో డబ్బు పోగొట్టుకుని అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు క్రికెట్ బెట్టింగ్‌తో జరిగే నష్టాలు, అనార్థాలపై అవగాహన కల్పించి చర్య తీసుకోవాలని కోరుతున్నారు.

● గతంలో తగ్గినట్టే తగ్గి.. మళ్లీ..

జిల్లాలో బెట్టింగ్ భూతం పట్టణాల నుంచి పల్లెలకు విస్తరించింది. పల్లెల్లోనూ బుకీలు, సబ్ బుకీలు పుట్టుకొచ్చారు. గతంలో ఎస్పీగా పనిచేసిన పీహెచ్‌డీ రామకృష్ణ బెట్టింగ్ రాయుళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా ఎన్నో కుటుంబాలను బలి తీసుకున్న క్రికెట్ బెట్టింగ్ మాఫియాపై దృష్టి పెట్టి మరీ ఉక్కుపాదం మోపడంతో అప్పుడు క్రికెట్ బెట్టింగ్‌కు బ్రేక్ పడింది. అప్పుడు తగ్గినట్లే తగ్గి నేడు మళ్లీ జోరు అందుకుంది.

● టెక్నాలజీ వాడుకుంటున్న బెట్టింగ్ రాయుళ్లు

టెక్నాలజీని క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్‌ల్లో మెసేజ్‌ల ద్వారా వివిధ రకాలు కోడ్‌లను (ఎవరికి అనుమానం రాకుండా) అనుసరించి బెట్టింగ్ కాస్తున్నారు.

● వాట్సప్ మెసేజ్‌లు

వాట్సప్ మెజేస్‌లు పెట్టిన తర్వాత వెంటనే అవతలి వ్యక్తి సమాచారం అందగానే బెట్టింగ్ నిర్వాహకులు నిర్ధారణ చేసుకుని దానిని ఉపయోగించుకుంటున్నారు. ఇలా పలు రుపాలుగా టెక్నాలజీని క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల వాడుకుంటున్నారు. దీంతో పోలీసులకు కూడా వారిని పట్టుకోవడం కష్టంగా మారింది.

సంపూర్ణ అక్షరాస్యత సాధనకు కృషి చేద్దాం

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు కృషి చేద్దామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కమ్యూనిటీ మొబెలైజర్స్ సమావేశంలో మాట్లాడారు. చైతన్యవంతమైన నియోజకవర్గం పూర్తి అక్షరాస్యతతోనే సాధ్యం అవుతుందన్నారు. అందుకు వీపీఆర్ ట్రస్టు పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

అక్షరాస్యులుగా మార్చాలి: కలెక్టర్

నియోజకవర్గంలో ఉన్న 22వేల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత కమ్యూనిటీ మొబెలైజర్స్‌దే అని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. నియోజకవర్గంలో 2,500 మంది స్వచ్ఛంద ఉపాధ్యాయుల్ని నియమించినట్లు వివరించారు. బాగా పనిచేసిన 10 మంది మొబలైజర్స్‌ను గుర్తించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సన్మానిస్తామన్నారు. కార్యక్రమంలో వ యోజన విద్య డిప్యూటీ డైరక్టర్ అజాద్, జడ్పీ సీఈఓ విద్యారమ, డ్వామా పీడీ గంగాభవాని, డీఈవో బాలాజీరావు సర్పంచు విజయమ్మ పాల్గొన్నారు.



సమావేశాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొడవలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : తలమంచి- కొడవలూరు రైల్వే స్టేషన్ల మధ్య 186/సీ13- సీ14 పోస్టుల మధ్య మూడోలైన్‌లో 40- 45 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం రైలు కిందపడి మరణించాడు. రైల్వే పోలీసులు వివరాలు మేరకు.. ఆ వ్యక్తి పింక్, పసుపు రంగు నిలువు చారలున్న నిండు చేతుల చొక్కా, సిమెంటు రంగు లుంగీ, మహాసిమెంట్ కంపెనీ పసుపు రంగు టీషర్ట్ ధరించి వున్నాడు. ఈ మేరకు కావలి జీఆర్‌పీ ఎస్‌ఐ రమాదేవి కేసు నమోదు చేశారు.

చోరీ నిందితుల అరెస్టు

నెల్లూరు, (తోటపల్లిగూడూరు) ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పగలు వ్యాపారాలు చేసుకుంటూ జల్సాలు అలవాటు పడి రాత్రి చోరీలకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు అడిషనల్ ఎస్పీ సౌజన్య తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ప్రత్యామ్నాయ పంటలతో ఆదాయం

● జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి




మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుంటే రైతులకు ఆదాయం చేకూరడంతో పాటు భూములు సారవంతం అవుతాయని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి తెలిపారు. మంగళవారం చెల్లాయపాళెం రైతుసేవా కేంద్రంలో భూసార పరీక్షలు, ప్రత్యామ్నాయ పంటలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. వరి పంటలు పండే పొలాల్లో మినుము, పెసరలాంటి ప్రత్యామ్నాయ పంటలు కూడా సాగు చేస్తే నేలలో నత్రజని శాతం పెరుగుతుందన్నారు. భూసార పరీక్షల ఆవశ్యకతపై ఏడీఏ శేషగిరిరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ నర్సోజిరావు, మండల వ్యవసాయధికారి ఎం.సురేంద్రరెడ్డి, వీఏఏ కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.

ఐదుగురికి వినూత్న కంటి సర్జరీ

వెంకటాచలం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో వినూత్న కంటి నల్లగుడ్డు సర్జరీ విజయవంతంగా నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సుశాంక్, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ మౌనికలు మంగళవారం ఆపరేషన్ చేయించుకున్న వారితో కలిసి మాట్లాడారు. ఎలాంటి ఫీజు లేకుండా ఉచిత సర్జరీ చేశామని, మూమూలుగా అయితే ఒకరికి రూ.లక్ష ఖర్చు అవుతుంద న్నారు. నెలలో ఒక్కరోజు మాత్రమే ఉచిత ఆపరేషన్లు చేస్తామన్నారు. పరిసర ప్రాంతాల్లో ఉండే వారు కూడా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి కార్యనిర్వాహక సిబ్బంది వాసుబాబు, వెంకటరావు, అనూబ్‌బాబు తదితరులున్నారు.

మట్టి నమూనాలపై అవగాహన



నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఇందుకూరుపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):మైపాడు,కొరుటూరులో మండల వ్యవసాయాధికారి రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఖరీఫ్ పంటల ప్రణాళిక, మట్టి నమూ నాల సేకరణపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో ఎన్‌ఎల్ఆర్-3354, కెఎన్‌ఎం-1638, ఎంటీయూ -1010 రకం వరి విత్తనాలు అనుకూలం అన్నారు. వరి విత్తనాలకు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు నరహరి పెంచలయ్య గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

విడవలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం పంచాయతీలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కవిత, ఉపాధ్యాయులు శ్యాంసుందర్‌రావు, నరసయ్య పాల్గొన్నారు.

నేత్రదానం

విడవలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్యాంకు వీధిలో నివాసమున్న పల్లం రమణమ్మ (65) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. మన సేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో మృతిరాలి నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. నేత్రాలను నెల్లూరు మోడరన్ ఐ ఆసుపత్రి వైద్యులు నాగేశ్వరరావు సేకరించారు.

న్యాయసేవలు సద్వినియోగం చేసుకోండి

● న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి



ఖైదీల వివరాలను అడిగి తెలుసుకుంటున్న న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కే వాణి

వెంకటాచలం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి సూచించారు. మండలంలోని చెముడుగుంట సమీపంలోని జిల్లా కేంద్ర కారాగారంలో మంగళవారం నిర్వహించిన న్యాయవి జ్ఞాన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖైదీల యోగా క్షేమాలు, వారి కేసుల వివరాలు, భోజన వసతి, వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలన్నారు. లాయర్లు పెట్టుకోలేని వారికి తామే ఉచితంగా ఏర్పాటు చేస్తామన్నారు. తెలిసో, తెలియకో చేసిన తప్పులు మరలా చేయరాదన్నారు. ఇక్కనైనా బయటకు వెళ్లిన తర్వాత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను సంతోషంగా చూసుకోవాలన్నారు. కార్య క్రమంలో హర్షవర్ధన్, ప్రతాప్, రవితేజరెడ్డి ఉన్నారు.

'కక్ష సాధింపుతోనే చర్యలు'

విడవలూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మూడున్నర ఏళ్లుగా ప్రజలకు సేవ చేస్తున్న తన చెక్ పవర్‌ను స్థానిక వైనార్టీ నాయకుడు రద్దు చేయించాడని ముదివర్తి గ్రామ సర్పంచు విడవలూరు నిర్మలమ్మ ఆరోపించారు. ముది వర్తిలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరిన ఆయన దళిత మహిళను అన్న చులకన భావంతో తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడినాడని ఆరోపించారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఇమాంభాష, అనిల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు ఘన వీడ్కోలు



మురళీమోహన్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

వెంకటాచలం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కనుపూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐక్యం మురళీమోహన్ స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మురళీమోహన్ దంపతులిద్దరినీ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాటకం శ్రీనివాసులు, కమిటీ చైర్మన్ షేక్ మస్తాన్ బీ, పాఠశాల ఉపాధ్యాయులు హరిత, రఫీ, ఉమా మహేష్, పెంచలయ్య, ప్రసన్నలక్ష్మి గ్రామస్థులు పాల్గొన్నారు.

గిరిజన కాలనీలో పర్యటన

పొదలకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన శ్రామికనగర్‌లో జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా బొబ్బేపల్లి మాట్లాడుతూ ఎవరికైతే ఇళ్ల పట్టాలు లేక ఇబ్బంది పడుతున్నారో వారి సమస్యలను స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో పినిశెట్టి మహేష్, సందూరి శ్రీహరి, చల్లా చెంచయ్య, మణి, బండి మనోజ్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం పరిశీలన

ఇందుకూరుపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరులో జరుగనున్న యోగాంజనేయస్వామి, షిరిడీ సాయిబాబా స్వామి వార్షికోత్సవాల సందర్భంగా జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని జిల్లా అదనపు వైద్యాధికారి ఖాదర్ వలి పరిశీలించారు.

ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నీ పోస్టర్ల ఆవిష్కరణ

వెంకటాచలం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఎస్‌యూలో ఈ నెల 30 నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడారు. దేశంలోని వివిధ యూనివర్సిటీల నుంచి 93 మహిళల జట్లు టోర్నమెంట్‌లో పాల్గొంటాయన్నారు. అలాగే 95 పురుషుల జట్లు వచ్చే నెల 4 నుంచి 8వరకు పోటీ పడతాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ సునీత, వర్సిటీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హనుమారెడ్డి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ సీహెచ్ వెంకట్రాము లు, పరీక్షల నిర్వాహణాధికారి మధుమతి, డీన్ సీడీసీ హుసేనయ్య, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త అల్లం ఉదయ్‌శంకర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుజయ్‌కుమార్, స్పోర్ట్స్ బోర్డు సిబ్బంది అజయ్, పీడీ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ కృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యంనాయుడు, లక్ష్మీప్రసన్న తదితరులు ఉన్నారు.

చెత్త బుట్టలు మూలకేనా..?



మండలకేంద్రంలోని రైతుసేవా కేంద్రంతో పాటు కాగితాలపూరు సచివాలయంలో చెత్తబుట్టలు మూలన పడేశారు. గతేడాది ప్రభుత్వం వీటిని పంపిణీ చేసింది. ఆగస్టులోగా పంపిణీ చేయాలని సూచించింది. పంచాయతీ అధికారులు మాత్రం అన్ని ఇళ్లకు సరిపడవని వీటిని కార్యాలయాల్లో మూలనపారవేశారు. సదుద్దేశంతో ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర-స్వ ర్ణాంధ్ర నినాదంతో వెళుతుంటే అధికారులు నిర్లక్ష్యంతో లక్ష్యం నీరుగారిపోతుంది.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

C.R.I.M.E N.E.W.S

హత్య కేసులో నిందితుల అరెస్ట్

● చంపేస్తాడేమో అన్న భయంతో చంపేశారు



నిందితుల వివరాలు తెలుపుతున్న డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పెన్నానదిలో జరిగిన హత్య కేసులో నిందితులను నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను నగర డీఎస్పీ సింధుప్రియ ఆమె కార్యాల యంలో మంగళవారం మీడియాకు వెల్లడించారు. జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన బేల్దారి షేక్ సుల్తాన్(38) మద్యానికి బానిసై పలువురిని బెదిరిస్తూ నగదు దోచుకొని మద్యం సేవించేవాడు. అతను ఈ నెల 16వ తేదీ రాత్రి న్యూకాలనీ సమీపంలోని పెన్నానది వద్ద దారుణ హత్యకు గురయ్యాడు. సుల్తాన్ తల్లి కరిముస్నీసా ఫిర్యాదుతో నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ కే సాంబశివరావు నేతృత్వంలో ఎస్‌ఐలు రెహమాన్, శివయ్య ప్రత్యేక బృందాలతో దర్యాప్తు జరిపారు. న్యూకాలనీకి చెందిన షేక్ సలీం అలియాస్ కలిమ్, మైపాడురోడ్డు సింహపురి కాలనీకి చెందిన ఎం నాగరాజును నిందితులుగా గుర్తించి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా హత్య చేయడానికి కారణాలు వెల్లడించారు. మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని సలీంను సుల్తాన్ అడగ్గా అతను లేవని చెప్పాడు. దీంతో సుల్తాన్ అతన్ని బెదిరించడంతో భయపడిన సలీం తన స్నేహితుడు నాగరాజుతో కలిసి సుల్తాన్‌ను హత్య చేయాలని నిర్ణయించాడు. ఈ క్రమంలో 16వ తేదీ రాత్రి కర్రలతో సుల్తాన్‌ను బలంగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులను అరెస్ట్ చేసిన ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐ బీవీ నరసయ్య, హెచ్‌సీ ప్రసాద్, కానిస్టేబుళ్ల రత్నయ్య, సురేంద్రబాబు, మస్తానయ్య, వేణు తదితరులను డీఎస్పీ అభినందించారు.

కోర్టు ఉత్తర్వులతో ఒకరి అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో న్యాయస్థానం ఆదేశాల మేరకు చిన్నబజారు పోలీసులు మంగళవారం మిరియాల వెంకట రమణయ్యను అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఓ మహిళకు ఉద్యోగం ఇప్పిస్తానని నగదు తీసుకొని వెంకట రమణయ్య మోసం చేశారు. ఆ కేసులో ఆయన వాయిదాలకు హాజరు కాకపోవడంతో కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం నెల్లూరు కేంద్రకారాగారానికి పంపారు.

మూడు నెలలుగా ఒక్క కేసు నమోదు కాలేదంటే మార్పు వచ్చినట్టే : ఎక్సైజ్ డీసీ



మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు

బిట్రగుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బీ, సీ కేటగిరీలైన కప్పరాళ్లతిప్ప, బోగోలు, చెంచులక్ష్మీపురం, సోమేశ్వరపురం గ్రామాల్లో మూడు నెలలుగా నాటుసారా తయారీ, అ మ్మకాలు, రవాణా లాంటి కేసులు నమోదు కాలేదంటే, వారిలో మార్పు వచ్చినట్లేనని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. బోగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎక్సైజ్ అధికారులు దయాసాగర్, శ్రీనివాసులునాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సారారహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న సంకల్పనతో ప్రత్యేక దృష్టి ఉంచిందన్నారు. మండలంలో వచ్చిన మార్పుతో సారారహిత గ్రామాలు ప్రకటిస్తూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎస్సై భోజ్యా, అటవీశాఖ అధికారి సుమన్, ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్, ఎక్సైజ్ ఎస్సై దేవిక, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాల్టా చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

● జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు

ముత్తుకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వాల్టా చట్టాన్ని అతిక్రమించి భూగర్భ జలాలను తోడివేస్తున్న ప్రదేశాలను గుర్తించేందుకు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం పంటపాలెం పంచాయతీ పరిధిలోని కోళ్లమిట్ట సమీపంలో తహసీల్దారు స్వప్నతో కలిసి విజిలెన్స్ సీఐ సుభాన్, వేణుగోపాల్ మూడు చోట్ల తనిఖీలు నిర్వహించారు. వీరి వెంట విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నారు. విద్యుత్ కనెక్షన్‌లు తీసుకున్న విధానం ఒకటైతే వాటిని మరొక విధానంలో వాడుకుంటూ వ్యాపారం చేసే ప్రక్రియలో అక్రమ బోర్లు వేసినట్లు వారు గుర్తించారు. వాల్టా చట్టం ప్రకారం తనిఖీలు నిర్వహిస్తుండగా జిల్లా కేంద్రం నుంచి ఉన్నతాధికారులు నుంచి ఫోన్ కాల్ రావడంతో వెంటనే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. 13మందిపై ఫిర్యాదులుండగా నలుగురికి సంబంధించిన బోర్లుతో పాటు లీజు వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు. మరో రెండు రోజుల్లో మిగిలిన బోర్లు కూడా పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. బోర్లు ఎన్ని, భూమి వివరాలు, విద్యుత్ కనెక్షన్లు వాటి పేర్ల వివరాలు, భూమిని లీజు ప్రాతిపదికన తీసుకుని భూగర్భ జలాలు అమ్మకాలు చేస్తున్న వారి వివరాలు సమగ్రంగా నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు?

● ఐదు కేజీల సరుకు స్వాధీనం?

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయాలపై సంతపేట పోలీసులు మంగళవారం దాడులు చేసి ఐదుగురు విక్రేతలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సేకరించిన సమాచారం మేరకు... నెల్లూరులోని పెన్నానది పొర్లుకట్ట సమీపంలో గంజాయి విక్రయాలు సాగుతున్నాయన్న సమాచారంతో సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన ఐదుగురు గంజాయి విక్రేతలు పరారవుతుండగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి సుమారు ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	100
స్కిన్ చికెన్	184
స్కిన్‌లెస్	204

కోడిగుడ్ల ధర (100): 420



వైభవంగా శ్రీవారి కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : నగరంలో బాలాజీనగర్ సీతారామ మందిరంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామికి శ్రవణ నక్షత్రం సందర్భంగా మంగళవారం కల్యాణోత్సవం జరిగింది. ముందుగా స్నపన తిరుమంజనం, పంచామృతాభిషేకాలు జరిగాయి. అనంతరం కల్యాణోత్సవాన్ని శాస్త్రానుసారం నిర్వహించారు. ఆ తర్వాత నగరోత్సవం కన్నుల పండువగా జరిగింది. వికాస్ ప్రజాహిత సేవా సమితి అధ్యక్షుడు కర్తం ప్రతాప్‌రెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు. ఆలయ కమిటీ సభ్యులు అమరా మోహన్ రావు, అధ్యక్షుడు తన్నీరు మస్తాన్‌రావు, కార్యదర్శి సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి కొప్పరపు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో జల్లెడ

- నేర నియంత్రణకు పోలీసుల కార్డన్ సెర్చ్
- భగత్‌సింగ్ కాలనీలో నలుగురు
- అల్లీపురంలో 8 మంది పాతనేరగాళ్ల గుర్తింపు
- సరైన పత్రాల్లేని 66 వాహనాల స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణలో భాగంగా నగరంలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. నేరస్తుల కోసం ఇల్లిల్లు జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో భగత్‌సింగ్ కాలనీలో ఉన్న టిడ్కో గృహ సముదా యాల్లో మంగళవారం నగర డీఎస్పీ పీ సింధుప్రియ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతీ ఇంటిని పరిశీలించి వాహన పత్రాలను తనిఖీ చేశారు. పత్రాలు సరిగాలేని 54 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలు, రెండు కార్లను స్వాధీనం చేసుకొని నవాబుపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. నలుగురు పాత నేరస్థులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ సందర్భంగా నగర డీఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కార్డన్ సెర్చ్ చేపట్టామన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రజలు డయల్ 112, 100కుగానీ స్థానిక పోలీసులకుగానీ సమాచారం ఇవ్వాలని కోరారు. కార్డన్ సెర్చ్‌లో ఇన్‌స్పెక్టర్‌లు కే సాంబశివరావు, జీ దశరథ రామారావు, రోశయ్య, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ సింధుప్రియ



కార్డన్ సెర్చ్‌లో అనుమానితుడి వేలిముద్ర సేకరిస్తున్న పోలీసులు

8 మంది పాత నేరగాళ్ల గుర్తింపు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లో పోలీసులు రెండు రోజులుగా కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. ఇందులో ఎనిమిది మంది పాత నేరస్తులు పట్టుబడ్డారు. మంగళవారం అల్లీపురం వద్దనున్న టిడ్కో ఇళ్ల వద్ద రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు నేతృత్వంలో రూరల్ సీఐ గుంజి వేణు, ఎస్సై, కానిస్టేబుళ్లు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కొందరు అనుమానస్పదంగా ఉండటంతో వారి వేలి ముద్రలను సేకరించారు. 8 మందిని పాత నేరస్తులుగా గుర్తించారు. వారిని స్టేషన్‌కు తరలించారు. సరైన పత్రాలు లేని కారణంగా మూడు బైకులు, ఒక ఆటో, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. 700 ఇళ్లలో తనిఖీలు నిర్వహించి 70 మంది వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో శిక్షణలో ఉన్న మహిళ డీఎస్పీ సుప్రియ పాల్గొన్నారు.

ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సెలింగ్

నెల్లూరు(క్రైం,ఆంధ్రజ్యోతి) : నగరంలో అల్లరి మూకలు, ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి వారితోపాటు వారి తల్లిదండ్రులకు పోలీసులు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర నియంత్రణలో భాగంగా వేదాయపాళెం స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు తనిఖీలు నిర్వహిం చారు. మహిళలు, యువతులను వేధిస్తున్న పోకిరీలు ఎక్కువ గా ఉంటున్న హాట్ స్పాట్లను గుర్తించి జల్లెడ పడుతున్నామని చెప్పారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదన్నారు.

సాహితీవేత్త మెట్టు రామచంద్ర ప్రసాద్ అస్తమయం



నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సాహితీ కుసుమం, ప్రముఖ వాణిజ్యవేత్త మెట్టు రామచంద్ర ప్రసాద్ మంగళవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. శ్వాసకోశ సంబంధ వ్యాధితో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన ఎంఆర్ ప్రసాద్‌గా జిల్లా, రాష్ట్ర ప్రజలకు సుపరిచితుడు. వీఆర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, పలువురు ప్రముఖులకు పాఠాలు బోధించారు. ఎంఆర్ ప్రసాద్ గురువు పోలూరు హనుమజ్జానకీ రామశర్మ. ఆయన శత జయంతి సందర్భంగా పలు సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. అధ్యాపకుడుగా, సాహిత్య ఉపన్యాసకుడిగా, రచయితగా, తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేశారు. తెలుగు పద్యాన్ని భావితరాలకు అందించాలని పద్య కళాపరిషత్‌ను స్థాపించి సాహిత్య సదస్సులు నిర్వహించారు. అధ్యాపకుడిగా ఎందరో పేద విద్యార్థులను తీర్చిదిద్దారు. వాణిజ్యవేత్తగా 1977లోనే కోళ్ల పరిశ్రమకు పునాది వేశారు. ఎందరో రైతులను కోళ్ల పెంపకం వైపు ప్రోత్సహించారు. జాతీయ స్థాయిలో కోడిగుడ్ల వ్యాపారం చేశారు. నేషనల్ ఎగ్ కో ఆర్డినేట్ కమిటీ (నెక్)కి జిల్లా ప్రప్రథమ జోనల్ చైర్మన్‌గా సేవలు అందించారు. ఆయన మృతికి నెక్ జోనల్ చైర్మన్ నలబోలు బలరామయ్య నాయుడు, రాఘవ నాయుడు, ఆదినారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు, సాహితీకారులు సంతాపం తెలిపారు.

● వెంకయ్యనాయుడు సంతాపం

తన గురువు మెట్టు రామచంద్రప్రసాద్ మృతి అత్యంత విచారకరమంటూ పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. పోలూరు హనుమజ్జానకీ రామశర్మ పేరిట తెలంగాణ సారస్వత పరిషత్ ఏర్పాటు చేసిన అవార్డును అందజేసిన జ్ఞాపకాల నుంచి బయటపడక ముందే ఎంఆర్ ప్రసాద్ దూరం కావడం బాధాకరమని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు, శిష్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

భూమిని ప్రేమిద్దాం - రక్షిద్దాం

● ప్రజా సైన్స్ వేదిక సతీష్

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : భూమిని ప్రేమిద్దాం - రేపటి తరంకోసం రక్షిద్దామని ప్రజా సైన్స్ వేదిక నగర అధ్యక్షుడు ఎం సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ధరిత్రి దినోత్సవం సందర్భంగా నవాబుపేట హైస్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. విద్యార్థుల కు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, ప్రజాసైన్స్ వేదిక సభ్యులు పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలలో...

నెల్లూరు(విద్యఆంధ్రజ్యోతి) : నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ ధరిత్రీ దినోత్సవాన్ని నిర్వహించారు. ధరిత్రీ దినోత్సవం గురించి విద్యార్థులకు తెలియచేసిన అనంతరం డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పీవీ కృష్ణారెడ్డి, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, ఉపాధ్యాయులు ఎం ధనుంజయ, జీ ప్రసాద్, ఎం వరలక్ష్మి, వై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భూమి పరిరక్షణ అందరి బాధ్యత

● జీజీహెచ్ వైద్యుడు సురేంద్ర

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : భూమి పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అన్న విషయం తెలుసుకోవాలని ప్రభుత్వ జనరల్ ఆసు పత్రి వైద్యాధికారి డాక్టర్ బద్దెపూడి సురేంద్ర అన్నారు. మంగళవారం పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుజబుజ నెల్లూరు చిల్డ్రన్స్ హోంలో భూమి పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షేక్ మస్తాన్‌బాషా కుమారుడు జమీర్ పుట్టిరోజు సందర్భంగా చిల్డ్రన్ హోంకు మూడు నెలలకు సరిపడా నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కుడుముల సుబ్బారావు, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షకార్య దర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మార్కెట్ యార్డ్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మరమ్మతులు చేస్తున్నందున బుధవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నవాబుపేట, ఎఫ్‌సీఐ కాలనీ, నజీర్‌తోట, యనమలపాళెం, బంగ్లాతోట, కుసుమ హరిజనవాడ, ఎత్‌రాజుపాళెం, ఇండస్ట్రీయల్ ఏరియా, అల్లీపురం ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలియజేశారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

● భవన నిర్మాణ కార్మిక సంఘం

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు ఆ కార్మిక సంఘం నాయకులు వెల్లడించారు. మంగళవారం నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నాయకులు అల్లాడి గోపాల్, షేక్ జాన్‌బాషా, కాయం శ్రీనివాసులు మాట్లాడుతూ బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును వెంటనే పునః ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ క్లెయిముల కు నిధులు విడుదల చేయాలని కోరారు. ధర్నాకు కార్మికులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. నాయకులు సూర్యనారాయణ, పెంచలయ్య, నజీర్, సంపూర్ణమ్మ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి ఆనంతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి, అచ్యుత రెడ్డి

6 నుంచి వేదగిరి బ్రహ్మోత్సవాలు

● 11 మందితో ఉత్సవ కమిటీ ● చైర్మన్‌గా అచ్యుత్ రెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మే నెల 6 నుంచి 16వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు 11 మందితో కమిటీని నియమిస్తూ రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. పొట్టేపాళెం గ్రామానికి చెందిన ఇందుపూరు అచ్యుత శంకర్ రెడ్డిని చైర్మన్‌గా, ముత్తంశెట్టి శీనయ్య, చెరుకూరు సింహాద్రి, పురిణి సరస్వతి, బెల్లం శ్రీనివాసులురెడ్డి, తోడేటి కామాక్షమ్మ, మడపాకుల జయమ్మ, కొత్తకోట కవిత, డబ్బుగుంట కిష్టయ్య, సండి మురళీయాదవ్, కందుకూరు శ్రావణిని సభ్యులుగా ప్రకటించింది. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన అచ్యుత రెడ్డి, ఆల య మాజీ చైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి మంగళవారం నెల్లూరులో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు టెన్త్ ఫలితాల విడుదల

- విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ
- జిల్లాకు ఏస్థానం దక్కేనో!?

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎస్‌సీ (టెన్త్) పరీక్షా ఫలితాలను బుధవారం ఉదయం విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఫలితాల కోసం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 33,434 మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు కట్టుదిట్టంగా పరీక్షలు జరగ్గా, ఈ నెలా ఆరంభంలోనే మూల్యాంకనం ప్రారంభించి వారం రోజుల్లో పూర్తి చేశారు. ఈ ఏడాది గతంలోకంటే మెరుగుపడి రాష్ట్రంలో జిల్లా ఉత్తమ స్థానం సాధిస్తుందా అన్న ఉత్కంఠ అందరిలో నెలకొని ఉంది. అలాగే ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఇంటర్ పరీక్షలకు హాజరైన 3,580 మంది అభ్యాసకులు, ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలు హాజరైన 1597 మంది అభ్యాసకులు కూడా నేడు విడుదలయ్యే ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు.

● ఫలితాలు ఇలా..

టెన్త్ పరీక్ష ఫలితాలను అధికారిక వెబ్‌సైట్, వాట్సాప్ (మనమిత్ర), లీప్ యాప్‌లలో విడుదల చేయనున్నారు. bse.ap.gov.in, apopenschool.ap.gov.in వెబ్‌సైట్లలో కూడా ఫలితాలను చూసుకోవచ్చు. అలాగే వాట్సాప్‌లో 9552300009 నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపి, విద్యా సేవలను ఎంచుకుని ఆపై ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఎంచుకోవాలి. వారి రోల్ నెంబర్‌ను నమోదు చేయడం ద్వారా ఫలితాలు పీడీఎఫ్ రూపంలో పొందవచ్చు.

● తల్లిదండ్రుల్లో టెన్షన్

ఫలితాలు విడుదలవుతున్న నేపథ్యంలో పరీక్షలు రాసిన విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది. కానీ ఏ ఫలితం వచ్చినా, ఎన్ని మార్కులు వచ్చినా టెన్షన్ పడకూడదు. మార్కులే ప్రతిభకు కొలమానం, ప్రామాణికం కాదని తల్లిదండ్రులు గుర్తించాలని నిపుణులు చెబుతున్నారు.

నిపుణుల సలహాలతోనే ప్రత్యామ్నాయ పంటలు

● వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాసరావు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఎడగారులో రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేయాలనుకుంటే వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు తీసుకోవాలని ఆ శాఖ నెల్లూరు ఏడీ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం కాకుపల్లిలో రైతులతో కలిసి పంట పొలాల్లో మట్టి నమునాలను సేకరించారు. ప్రస్తుత సీజన్‌లో పంటలు వేసేటప్పుడు సాగునీటి సౌకర్యాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

'పోషణ్ పక్వాడ'పై అవగాహన

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : నగరంలోని జెండావీధి పీఎస్ఎం హైస్కూల్‌లో పోషన్ పక్వాడా పథకంపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. అర్బన్ సీడీపీవో లక్ష్మీదేవి మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని అందించటంలో అంగన్‌వాడీ కేంద్రాలు ప్రత్యేక భూమిక పోషిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర ప్రచార సహాయకుడు పీ హరికృష్ణ, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కత్తులతో బెదిరించి నగదు దోపిడీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులను కత్తులతో బెదిరించి నగదు దోచుకెళ్లిన నిందితులపై చిన్నబజారు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని వాకర్స్ రోడ్డు పొర్లుకట్టలో షేక్ షాకీర్ నివాసం ఉంటున్నాడు. ఆయన ఈ నెల 20వ తేదీ తన స్నేహితుడు ఖాదర్‌తో కలిసి స్కూటీపై పొర్లుకట్ట నుంచి పొట్టేపాలెంకు బయలుదేరాడు. పుత్తాఎస్టేట్ ఆరో క్రాస్‌రోడ్డు వద్దకు వెళ్లేసరికి విరాట్‌నగర్‌కు చెందిన షేక్ సుల్తాన్, కసాయి వీధికి చెందిన సోహైల్ స్కూటీని అడ్డుకున్నారు. కత్తులతో చంపుతామని బెదిరించి షాకీర్ జేబులోని రూ.500 నగదును దోచుకున్నారు. స్థానికులు రావడాన్ని గమనించి నిందితులు పరారయ్యారు. బాధితుడు మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ అభిమానం సల్లగుండ



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా నేటికీ గత ముఖ్యమంత్రి జగన్ ఫొటోలు ప్రభుత్వ పథకాల అమలులో కనిపిస్తుండడం గమనార్హం. మండలంలోని ఎండీయూ వాహనాలపై అలాంటి ఫొటోలు యథావిధిగా దర్శనమిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అప్పట్లో వాహనాలు పొందిన ఆపరేటర్లు తమ అభిమానాన్ని చాటుతూ ఫొటోలను తొలగించక పోయినా అధికారులు సైతం మనకెందుకులే అంటూ మౌనం వహించడం పలు అనుమానాలు తావు ఇస్తుంది. నిత్యవసర సరుకుల పంపిణీ సమయంలో రోజుల తరబడి గ్రామాల వైపు ఆ వాహనాలు వెళుతున్నా అవి అధికారులు ఎందుకు కన్పించడం లేదని కొందరు ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్లపై భవన నిర్మాణ సామగ్రిని ఉపేక్షించొద్దు

● ఇన్‌చార్జి కమిషనర్ నందన్



పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలో భవన నిర్మాణ దారులు రోడ్లను ఆక్రమించి నిర్మాణ సామగ్రిని ఉంచితే ఉపేక్షించవద్దని ఇన్‌చార్జి కమిషనర్ నందన్ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. మంగళవారం 1వ డివిజన్ కల్లీకాలనీ, నవలాకులతోట, నారాయణరెడ్డిపేట, కొత్తకాలువ కూడలి వంటి ప్రాంతాల్లో ఆయన ఆకస్మికంగా పారిశుధ్యాన్ని తనిఖీ చేశారు. ప్లానింగ్ సెక్రటరీలు ఎప్పటికప్పుడు రోడ్లపైన నిర్మాణ సామగ్రిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల్లో మృతి చెందిన వారి వారసులకు కారుణ్య నియామక ఉత్తర్వులను కార్పొరేషన్ కార్యాలయంలో పూర్వ కమిషనర్ సూర్యతేజతో కలిసి అందించారు. ఈఎస్ఐ పథకం ఉపయోగాలపై నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు. కాగా, ఎంహెచ్‌వో చైతన్య 38వ డివిజన్ మద్రాసు బస్టాండ్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

● నందన్‌కు ఎఫ్ఏసీ బాధ్యతలు

కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న ఏడీసీ నందన్‌కు కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఎఫ్ఏసీ బాధ్యతల్లో కొనసాగాలని ఆదేశాల్లో పేర్కొంది.

'స్పర్శ'పై అవగాహన ఉండాలి

● శక్తి యాప్ సదస్సులో వక్తలు



శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థులతో పోలీసులు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు, కళాశాల విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై స్పష్టమైన అవగాహన ఉండాలని పలువురు సూచించారు. మంగళవారం కల్లూరుపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కనుపర్తిపాడులోని ఇథాకా స్కూల్లో నెల్లూరు రూరల్ పోలీసులు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. మహిళల భద్రత కోసం తీసుకు వచ్చిన శక్తి యాప్‌ను అందరు వారి ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. విపత్తుకర పరిస్థితుల్లో 100, 112, 1098, 1930 నెంబర్లకు ఫోన్ చేస్తే సహాయక బృందాలు తోడ్పాటునిస్తాయని తెలిపారు. ఈ కార్యక్ర మంలో శక్తి యాప్ ఇన్‌చార్జి సుబ్బారావు, జడ్పీ స్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వ ర్లు, ఇథాకా స్కూల్ చైర్మన్ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ శోభన తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఢిల్లీ పర్యటనలో ఎంపీ వేమిరెడ్డి



ముఖ్యమంత్రి, సహచర ఎంపీలతో వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 22 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం నాటి ఢిల్లీ పర్యటనలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, వాణిజ్యం, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు. పలు అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు.

పోప్ ఫ్రాన్సిస్ మృతి బాధాకరం

క్యాథలిక్‌ల మత గురువు పోప్ ఫ్రాన్సిస్ మృతి బాధాకరమంటూ ఎంపీ వేమిరెడ్డి ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ప్రపంచ శాంతికి ఫ్రాన్సిస్ అవిశ్రాంత పోరాటం చేశారన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 23 ఏప్రిల్ 2025



ఏఈ జాబ్ వదులుకుని సివిల్స్ సాధించాడు

● యూపీఎస్సీ పరీక్షల్లో 988వ ర్యాంకు సాధించిన సురేష్

నారాయణవనం/పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):ఐఏఎస్ అధికారి కావడం కోసం జెన్‌కోలో ఏఈ ఉద్యోగం వదులుకున్న సురేష్ 7వ సారి అనుకున్నది సాధించారు.ఈ సందర్భంగా మంగళవారం ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు.

● ఆ ఇద్దరే స్ఫూర్తి

చదివిన చదువుకు ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటే సరిపోతుంది కదా అన్న ఆలోచన అమ్మానాన్నలది.నాకు చిన్నప్పటినుంచీ స్వామి వివేకానంద,మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అంటే ఎంతో ఇష్టం.వారి స్ఫూర్తితోనే సమాజానికి నావంతు మరింత మెరుగైన సేవలందించాలని భావించా.సివిల్స్ వైపు దృష్టి సారించా.ఇంటర్వ్యూ వరకూ వెళ్లగలిగినా ఫలితం లేకుండాపోయింది.దీంతో ఏఈ ఉద్యోగానికి రిజైన్ చేసి సివిల్స్‌పైనే పూర్తి శ్రద్ధ పెట్టా.

కరోనాతో పోరాటం

2020లో ఢిల్లీ వెళ్లిన నాకు దేవుడు పరీక్ష పెట్టాడు. కరోనాతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నా.అమ్మానాన్నకు తెలిస్తే ఆందోళన పడతాతారని చెప్పలేదు.2021లో మరోసారి కరోనా సోకడంతో ప్రాణాపాయ పరిస్థితుల నుంచి బయటపడ్డా. యాంటీబయాటిక్స్ ఎక్కువ వాడడం వినికిడి సమస్య తెచ్చిపెట్టింది.నా కలకు నాలుగు సంవత్సరాల కాలయాపనకు కారణమైంది.చివరకు ఏడవ ప్రయత్నంలో ఈసారి నా కలను నిజం చేసుకున్నా.

గ్రామచైతన్య ఫౌండేషన్

మా ఊరికి ఏదో ఒకటి చేయాలన్న ఆలోచన నుంచి గ్రామ చైతన్య ఫౌండేషన్ స్థాపించా. శ్రీశైలంలో ఏఈగా పని చేస్తున్నప్పుడు ఆదివాసి పిల్లలు, మత్స్యకారుల పిల్లలు విద్యకు దూరంగా ఉండడం చూసి బాధపడ్డా.వారికి విద్య పట్ల అవగాహన కల్పించాలన్న సత్సంకల్పంతో ఫౌండేషన్ ఏర్పాటు చేశా. అందుకు నాతో పాటు పని చేసే జెన్‌కో ఉద్యోగులు కూడా సహకరించారు. ఈ క్రమంలో సమాజం పట్ల మెరుగైన అవగాహన ఏర్పడింది. సివిల్స్‌లో నా ఆప్షనల్ సబ్జెక్ట్ తెలుగు సాహిత్యం.పుస్తకాలను నిరంతరం చదువుతుంటా.

నారాయణవనం మండల పరిధిలోని గోవిందప్ప నాయుడు కండ్రిగలో నివాసముంటున్న రైతు మురగయ్య, మునిలక్ష్మి దంపతుల కుమారుడు పాముూరి సురేష్ మంగళవారం విడుదలైన యూపీఎస్సీ పరీక్షల్లో 988వ ర్యాంకు సాధించారు.మెకానికల్ విభాగంలో నంద్యాలలో డిప్లొమా పూర్తి చేసిన సురేష్.కర్నూలు పుల్లారెడ్డి కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు.2012లో ఏపీ జెన్‌కో ఏఈ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉమ్మడి ఏపీలో మొదటి ర్యాంకు సాధించారు.ఏఈగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ సమాజానికి ఏదైనా చేయాలనే లక్ష్యంతో 2017 నుంచి సివిల్స్ ఎగ్జామ్స్ రాయడం ప్రారంభించారు. 2018లో ఇంటర్వ్యూ వరకు వెళ్లినా అదృష్టం వరించలేదు. 2019, 2020 సంవత్సరాల్లో సివిల్స్ ఫలితాలు నిరాశకు గురిచేశాయి. దీంతో శ్రీశైలంలో ఏఈ ఉద్యోగానికి రాజీనామా చేసి దేశ రాజధాని ఢిల్లీ బాటపట్టారు. పట్టువదలని విక్రమార్కుడిలా ఈసారి 988 వ ర్యాంకు సాధించారు.

'ఆన్‌లైన్' అతిపెద్ద సోర్స్

● సివిల్స్ కోసం ఢిల్లీకి అవసరం లేదంటున్న శ్రీకాంత్



పలమనేరు/తిరుపతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) :సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో నెగ్గాలనుకునేవాళ్లు ఢిల్లీకి వెళ్లి పెద్దపెద్ద శిక్షణ సంస్థల్లో చేరాల్సిన అవసరం లేదని, అందరికీ అందుబాటులోకొచ్చిన ఆన్‌లైన్ సర్వీసులను శ్రద్ధగా ఉపయోగించుకుంటే సరిపోతుందంటున్నారు రంపం శ్రీకాంత్.ఈ ఏడాది సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 904వ ర్యాంకు సాధించిన శ్రీకాంత్ మంగళవారం సాయంత్రం తిరుపతిలో ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు.

● నాన్న చెప్పిన మాటలతోనే

ఐఏఎస్ కావాలని నాన్న చిన్నతనం నుంచీ చెప్పేవారు. అయితే నేను పెద్దగా ఫోకస్ చేయలేదు. ఇంటర్మీడియట్ వరకు పలమనేరులోనే చదివా. ఆ తర్వాత హైదరాబాదులో ఇంజనీరింగ్, బెంగుళూరులో ఎంబీఏ పూర్తి చేశా. గూగుల్, అమెజాన్ వంటి సంస్థల్లో పనిచేస్తున్నప్పుడు నాన్న చెప్పిన మాటలు మళ్లీ గుర్తుకు వచ్చాయి. పదేపదే ప్రేరణగా వినిపించాయి. సివిల్స్‌కు ఎంపికవ్వాలని నిర్ణయం తీసుకున్నా.ఓవైపు ఉద్యోగం చేసుకుంటూనే మరో వైపు సివిల్స్‌పై దృష్టి పెట్టా. ఎలాంటి శిక్షణ తీసుకోలేదు.నాలుగుసార్లు పట్టువదలకుండా ప్రయత్నిస్తే ఈసారి అవకాశం వచ్చింది.

● ఆన్‌లైన్ వాడుకుంటే చాలు

సివిల్స్ పరీక్షలు రాయాలనుకునేవారు ఆన్‌లైన్‌లో దొరికే కంటెంట్ వాడుకుంటే సరిపోతుంది.దాంతో పాటు ఎవరైనా మెంటార్ దగ్గర మెలకువలు తెలుసుకోండి. నేను ఆ పనిచేయలేకపోవడం వల్ల నాలుగుసార్లు ప్రయత్నించాల్సి వచ్చింది.కరెంట్ ఎఫైర్స్‌పై అవగాహన పెంచుకోవడం, రెగ్యులర్‌గా న్యూస్ పేపర్లను చూడడం అలవాటు చేసుకోవాలి. నావరకు నేను ఇదే పద్ధతి అనుసరించా.



అత్తమామల అభినందనలు అందుకుంటున్న శ్రీకాంత్

ఈ ఏడాది సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 904వ ర్యాంకు సాధించిన శ్రీకాంత్ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని బైరెడ్డిపల్లె వాసి.ఈయన తండ్రి నాగరాజు ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి రిటైరవగా తల్లి రేణుక గృహిణి. ఉద్యోగరీత్యా శ్రీకాంత్ తల్లిదండ్రులు పలమనేరులో స్థిరపడ్డారు.పాఠశాల విద్యాభ్యాసం పలమనేరులో, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ హైదరాబాద్ సీబీఐటీలో, బెంగళూరు ఐఐఎంలో ఎంబీఏ పూర్తి చేసిన శ్రీకాంత్ గూగుల్ కంపెనీలో డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్‌గా పని చేస్తూ ఎవరి వద్దా శిక్షణ తీసుకోకనే సమగ్ర ప్రణాళికతో నిర్విరామంగా కృషిచేసి సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో ఉన్నతమైన ర్యాంక్ సాధించారు.శ్రీకాంత్ సోదరి మధురిమ గైనకాలజిస్టుగా బెంగళూరులో పని చేస్తున్నారు. తిరుపతి జిల్లా అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోత్స్న కుమార్తె శ్రావ్యను శ్రీకాంత్ ఐదేళ్ల క్రితం పెళ్లాడారు.శ్రావ్య ప్రస్తుతం బెంగళూరులోని టార్గెట్ కంపెనీలో ఫైనాన్స్ మేనేజర్‌గా పని చేస్తున్నారు.వీరికి మూడేళ్ల పాప వుంది.

ఏఎస్ఐ నుంచి కానిస్టేబుళ్ల దాకా..!

బదిలీలకు నేటి నుంచి కౌన్సెలింగ్

నాలుగు ఆప్షన్లతో కోరుకున్న చోటుకు

చివరగా ఎస్ఐలకూ స్థానచలనం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఏఎస్ఐల నుంచి కానిస్టేబుళ్ల వరకు దాదాపు 475 మంది బదిలీ కానున్నట్లు తెలిసింది. ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారు, విమర్శలు, ఆరోపణలు, సక్రమంగా పని చేయని వారిని బదిలీ చేయనున్నారు. బుధవారం నుంచి ఎస్పీ హర్షవర్ధన రాజు ఈ బదిలీల ప్రక్రియ చేపట్టనున్నారు. తొలుత కానిస్టేబుళ్ల బదిలీలు పూర్తి చేసి, ఆ తర్వాత హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు.. చివరగా ఎస్ఐల బదిలీలు పూర్తి చేయనున్నారు. ఇలా దాదాపు 475 మందిని బదిలీ చేసే దిశగా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం బదిలీ కానున్న 393 మంది కానిస్టేబుళ్ల ఐడీ నెంబరు, పేర్లు, ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం, ఎప్పటి నుంచి అక్కడ పనిచేస్తున్నారు? ఎన్ని సంవత్సరాలు అయింది? తదితర వివరాలు తీసుకున్నారు. వీరందరినీ బుధవారం తిరుపతి ఎస్పీ కార్యాలయానికి పిలిపించి బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వారి నుంచి నాలుగు ఆప్షన్లను తీసుకొని.. అవకాశం ఉన్నంత వరకు అందులో ఒక ప్రాంతానికి బదిలీ చేయనున్నారు. ఒకవైపు కొందరు తాము కోరుకున్న చోటుకు బదిలీ కావడానికి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తీసుకురాగా.. మరోవైపు పలానా వాళ్లను తమ ప్రాంతంతో నియమించాలని ఎస్పీకి రాజకీయ ఒత్తిడి వస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పనితీరు, క్రమశిక్షణ, పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం, అధికారుల ఆదేశాలు అమలు చేయడం వంటివాటిని ఏఎస్ఐల బదిలీలకు కొలమానంగా తీసుకోనున్నట్లు తెలిసింది. చివరగా ఎస్ఐల బదిలీలు ఉంటాయని సమాచారం. పోలీసు శాఖలో బదిలీలను పూర్తి పారదర్శకంగా చేస్తామని, ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని ఎస్పీ హర్షవర్ధన రాజు మంగళవారం ఆంధ్ర జ్యోతికి చెప్పారు.

గంజాయి, ట్రాఫిక్‌పై డ్రోన్ నిఘా

● తిరుపతిలో ముగ్గురి అరెస్టు ● నిబంధనలను అతిక్రమించిన వాహనదారుల గుర్తింపు

డ్రోన్ ద్వారా అందిన సమాచారంతో విష్ణునివాసం వద్దకు చేరుకుని ట్రాఫిక్‌ను



తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలు లేవు. పోలీసులూ లేరు. చుట్టుపక్కల జనం లేరు. ఇక, మనల్ని చూసేదెవరని అనుకుంటున్నారా? శివారు ప్రాంతాల్లో గంజాయి తీసుకుంటున్నారా? రోడ్లపై ఇష్టారాజ్యంగా హారన్లు మోగిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు విస్మరిస్తున్నారా? అలాంటి వారు ఇక అప్రమత్తం కావాలి. ఎందుకంటే ఆకాశం నుంచి మూడు కిలోమీటర్ల వరకు డ్రోన్ నిఘా ఉంటోంది. ఇలా తిరుపతిలో గంజాయి బ్యాచ్‌కు చెందిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని పలుచోట్ల సోమవారం అర్ధరాత్రి అధునాతన మ్యాట్రిక్ 4 థర్మల్ డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. తిరుపతి వెస్ట్ పరిధిలోని వెస్ట్ రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాల్లో స్పాట్ లైట్ కెమెరాలతో 112 జూమ్ కెమెరాలు కలిగి రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరం వరకు గంజాయి, మత్తు పదార్థాలు తీసుకుంటున్నా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా గుర్తించి కనిపెట్టే డ్రోన్‌ను ఎగురవేశారు. చీకటి ఉన్నా.. స్పష్టంగా డ్రోన్ కెమెరాలు ఫొటోలు తీస్తాయి. వీటిని పరిశీలిస్తూ పోలీసులు రంగంలోకి దిగుతారు. ఇలా సోమవారం రాత్రి తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ పరిధిలో డ్రోన్ ఎగురవేసినప్పుడు.. అక్కడ మనుషులు తిరగని ప్రాంతంలో ముగ్గురు గంజాయి తీసుకుంటున్నారు. వీరిని డ్రోన్‌లోని కెమెరా గుర్తించగానే.. పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేశారు.

దాక్కున్నా దొరుకుతారు

అర్ధరాత్రి పూట అడవులు, దట్టమైన ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో కూర్చుని మద్యం తాగుతున్నా, పేకాట వంటివి ఆడుతున్నా వెంటనే స్పాట్‌లైట్ కెమెరాలు వున్న డ్రోన్లు కనిపెట్టేస్తాయి. ఫొటోలు తీస్తాయి. ఇక, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా, ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రవర్తించినా డ్రోన్ కెమెరాలు పట్టేస్తాయి. ఎక్కడ దాక్కున్నా డ్రోన్ల నిఘాకు దొరుకుతారు. అలాంటి అలాంటి వారి ఆట కట్టిస్తాం. ప్రతి సబ్ డివిజన్ పరిధిలో ఒక డ్రోన్‌తో నిరంతర నిఘా ఉంటుంది.

- హర్షవర్ధనరాజు, ఎస్పీ

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా..

తిరుపతిలో ట్రాఫిక్ రద్దీగా ఉన్న రైల్వే స్టేషన్, బస్టాండు, విష్ణునివాసం తదితర ప్రాంతాల్లో మంగళవారం అధునాతన డ్రోన్ కెమెరాల ద్వారా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు. విష్ణు నివాసం వద్ద ట్రాఫిక్ సమస్యను డ్రోన్ ద్వారా గుర్తించగానే అక్కడి ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే రంగంలోకి దిగి క్రమబద్ధీకరించారు. ట్రాఫిక్ పోలీసుల కొరత నేపథ్యంలో పలు కూడళ్లలో సిబ్బంది లేకపోవడంతో వాహనదారులు నిబంధనలు అతిక్రమించడం, అడ్డదిడ్డంగా రోడ్లపై పార్కింగ్ చేయడం, నిషేధిత హారన్లతో శబ్దం చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించేవారు. అలాంటి వారికి డ్రోన్‌తో చెక్ పెడుతున్నామని, ఎవరైనా ఇష్టారాజ్యంగా హారన్లు వేసుకుని వెళితే కేసులు బనాయిస్తామని ట్రాఫిక్ సీఐ సంజీవ్‌కుమార్ హెచ్చరించారు. ప్రతిరోజూ తిరుపతిలో ఎక్కడో ఒక చోట డ్రోన్‌తో నిఘా ఉండనే ఉంటుంది.

తిరుపతిలో స్వామి హాంఫట్

పూజలు, మంత్రాలు, తిరుమలలో దుకాణాలు ఇప్పిస్తానని మోసం

రూ.10 కోట్లతో పలాయనం

లబోదిబోమంటున్న బాధితులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పూజలు, మంత్రాల పేరు చెప్పాడు. తిరుమలలో దుకాణాలు ఇప్పిస్తానన్నాడు. ఇలా పలువురిని మోసం చేసిన ఓ స్వామి.. రూ.10 కోట్లతో పలాయనం సాగించిన ఉదంతం ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన ప్రకారం.. చెన్నైకి చెందిన స్వామి కొన్నేళ్ళ కిందట కుటుంబంతో పాటు తిరుపతికి వలసొచ్చాడు. 2021లో తిరుమలకు మకాం మార్చాడు. అక్కడ ఒక ఇల్లు అద్దెకు తీసుకుని పూజలు, మంత్రాలు పేరుతో భారీ ఎత్తున డబ్బులు వసూలు చేశాడు. ఈ క్రమంలో అక్కడి ఇంటి యజయానితో గొడవ పడి తిరుపతికి వచ్చాడు. శివజ్యోతినగర్‌లో కాపురం పెట్టాడు. ఇతడికి ఇద్దరు పిల్లలు. గత రెండున్నర సంవత్సరాలుగా తిరుపతిలో ఉన్నాడు. తెలిసిన వారికి జాతకాలు చెప్పడం, మంత్రాలు, తంత్రాలు చేయడం, వివిధ రకాల పూజలు చేస్తూ ప్రజలను నమ్మించాడు. తనకు జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు బాగా తెలుసని, ఏవైనా పనులు కావాలంటే చేసి పెడతానని పలువురికి చెప్పాడు. తిరుమలలో దుకాణాలు తీసిస్తానన్నాడు. ఇతడిని నమ్మిన కొందరు తమ పనుల నిమిత్తం రూ.15 లక్షల నుంచి రూ.90లక్షల వరకు స్వామికి ఇచ్చారు.తిరుమలలో దుకాణం ఇప్పిస్తానని చెప్పి,అక్కడి బాలాజీనగర్‌లోని ఇద్దరు అన్నదమ్ముల వద్ద దాదాపు రూ.1.30 కోట్లు తీసుకున్నట్లు వీరిలో ఒకరు చెప్పారు. ఇలా దాదాపు 10నుంచి 15 మంది బాధితులు ఉన్నారు.వారం రోజులుగా అతడు కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు శివజ్యోతినగర్‌లోని ఇంటికి వెళ్లి చూడగా తాళాలు వేసి ఉంది.చుట్టుపక్కల వారిని విచారించగా ఈ నెల 16న ఊరికి వెళుతున్నానని చెప్పి వెళ్ళారని చెప్పారు. దీంతో వారం రోజులుగా వేచి చూసిన బాధితులు చివరకు అలిపిరి పోలీసులను మంగళవారం ఆశ్రయించారు.



గాయపడిన మహిళా ఉద్యోగులు



తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ ఉద్యోగి

మర్రిగుంట మలుపు వద్ద బోల్తా పడిన ట్రాక్టర్, బస్సు



ట్రాక్టర్, బస్సు ఢీ : 45 మందికి గాయాలు

రేణిగుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం మర్రిగుంట మలుపు వద్ద మంగళవారం ఉదయం 7.30 గంటలకు జరిగిన ప్రమాదంలో 45 మంది గాయపడ్డారు. యోగానంద ఉమెన్స్ హాస్టల్ నుంచి విమానాశ్రయం సమీపంలోని ఫాక్స్ లింక్ పరిశ్రమలో పనిచేయడానికి మహిళా ఉద్యోగులు కంపెనీ బస్సులో బయలు దేరారు. అదే సమయంలో రేణిగుంట నుంచి పాపానాయుడుపేటకు వెళ్తున్న ట్రాక్టర్ మర్రిగుంట మలుపు వద్దకు వచ్చింది. వేగాన్ని నియంత్రించే క్రమంలో బ్రేకులు వేసినా.. బస్సు, ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో బస్సు బోల్తా పడింది. అందులో ఉన్న 45 మంది మహిళ ఉద్యోగులు గాయపడ్డారు. డీఎస్పీ శ్రీనివాసరావు సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన 35 మందికి ప్రథమ చికిత్సలందించారు. ఆరుగురు తీవ్రంగా గాయపడగా ఇందులో నలుగురు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాయుడుపేట సెజ్‌లో సోలార్ పవర్ ప్లాంట్

రూ.4200 కోట్ల పెట్టుబడి.. 1500 మందికి ఉపాధి

తిరుపతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎంపీ సెజ్‌లో రూ.4200 కోట్ల పెట్టుబడితో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కానుంది. 8 గిగా వాట్స్ సోలార్ పవర్ పీవీ సెల్ మానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ ఏర్పాటుకు మెస్సర్స్ ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ ముందుకొచ్చింది.ఈ సంస్థకు పలు రాయితీలు, మినహాయింపులను ఇస్తూ ప్రభుత్వం రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. సెజ్‌లో ఎకరా రూ.60 లక్షల చొప్పున 106.6 ఎకరాలను కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. పదేళ్ల వ్యవధిలో రూ.635 కోట్లకు మించకుండా ప్లాంట్, యంత్రాలు.. రూ.345 కోట్లకు మించకుండా యుటిలిటీస్‌పై పెట్టుబడి వ్యయంలో 30 శాతం రాయితీకి.. ఏడాదికి రూ.45.99 కోట్ల చొప్పున విద్యుత్ ఛార్జీలలో పదేళ్ల పాటు రాయితీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రోజుకు 7.7 మిలియన్ లీటర్ల చొప్పున పదేళ్ల పాటు ఉచితంగా నీటి సరఫరాకు అంగీకరించింది. ఈ మొత్తం 127.75 కోట్లు మించకూడదని షరతు విధించింది. భూముల రిజిస్ట్రేషన్‌కు రూ.4.80 కోట్ల స్టాంప్ డ్యూటీ మినహాయింపునకు సంసిద్ధత వ్యక్తం చేసింది.

శ్రీసిటీలో అమార్ఫస్ మెటల్ తయారీ ప్లాంట్

● రూ. 1055 కోట్ల పెట్టుబడి.. 515 మందికి ఉపాధి

తిరుపతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో అమార్ఫస్ మెటల్ మానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటుకుగాను మెస్సర్స్ ప్రొటేరియల్ లిమిటెడ్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ప్యాకేజీ కింద పలు రాయితీలు, మినహాయింపులు ప్రకటించింది. ఏడాదికి 64,800 టన్నుల అమార్ఫస్ సామర్థ్యం, రూ.1055 కోట్ల పెట్టుబడితో 515 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ ప్రభుత్వానికి నివేదించింది. తొలి దశలో వచ్చే ఏడాది మార్చికల్లా ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసి, పవర్ కనెక్షన్ తీసుకుంటామని, ఏప్రిల్‌లో ఉద్యోగులకు శిక్షణ పూర్తి చేస్తామని తెలిపింది. జూన్‌లో యంత్రాల ఏర్పాటు చేసి అక్టోబరుకల్లా ప్లాంట్‌ను ప్రారంభానికి సిద్ధం చేస్తామని నవంబరు నుంచీ ఫస్ట్ లైన్ ప్రొడక్షన్, 2027 ఏప్రిల్ నుంచీ సెకండ్ లైన్ ప్రొడక్షన్ ప్రారంభిస్తామని తెలిపింది. రెండవ దశ పనులు 2030 మార్చి నాటికి పూర్తి చేస్తామని నివేదించింది. ఈ నెల 4న ఎస్ఐపీసీ, 10న ఎస్ఐపీబీ సమావేశాల్లో చేసిన సిఫారసులు సమీక్షించిన ప్రభుత్వం స్పెషల్ ప్యాకేజీ కింద పలు రాయితీలు, మినహాయింపులు మంజూరు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

తిరుమలలో తమిళ నటుడు విజయ్‌కుమార్



తమిళ సినీనటుడు విజయ్‌కుమార్ మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుమార్తె, నటి శ్రీదేవి, కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం బయట నటి శ్రీదేవి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది కుటుంబ సభ్యులతో తిరుమలకు రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. నారా రోహిత్‌తో నటించిన 'సుందరకాండ' త్వరలో విడుదల కాబోతోందని చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మాడవీధుల్లో చల్లదనం కోసం..




ఆలయం ముందు నీళ్లు వదులుతున్న ట్యాంకర్

చల్లని తిరుమల కొండ కూడా ఎండకు వేడెక్కిపోతోంది. మాడవీధుల్లో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీటీడీ ఇప్పటికే కూల్‌పెయింట్ వేసింది. తాత్కాలిక షెడ్లు నిర్మించింది. మాడవీధుల్లో గ్యాలరీల వెంబడి గ్రీన్ తెరతో పైకప్పులను ఏర్పాటు చేశారు. అయినా బండలు పరిచిన నేల సెగలు కక్కుతూనే ఉంది. దీంతో ప్రతి రెండు గంటలకోసారి ఆలయ నాలుగు మాడవీధులు, పరిసర ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని నిరంతరాయంగా చల్లుతున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 6 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 8 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.79కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,937

తలనీలాలు సమర్పించినవారు: 24,157

● నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం

పుస్తకం చిన్నబోతోంది..




నడిపేది..నడిపించేది.. పెను నిద్దుర వదిలించేది.. సమగ్ర వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది.. నిరంతరం మార్పు వైపు నడిపించేది పుస్తకం. నిజమే కానీ నేటి ఆధునికత పుస్తకాన్నీ ప్రభావితం చేస్తోంది. చదువరులను తగ్గించేస్తోంది. పుస్తక పఠనమే వ్యక్తిగత అభివృద్ధికి సోపానమనే విషయాన్ని విస్మరిస్తోంది. తద్వారా నేటి యువత చాలా నష్టపోతోందని పలువురు రచయితలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పుస్తకాన్ని దగ్గరకు తీసుకోవాల్సిన అవసరాన్ని వీరు నొక్కివక్కాణిస్తున్నారు. పఠనంతో మంచి జీవితానికి బాటలు వేసుకోవచ్చునని హితవు పలుకుతున్నారు. పుస్తకాలను పక్కకు నెట్టి ఎలక్ట్రానిక్ పరికరాలతో కాలక్షేపం చేస్తే భవిష్యత్తుకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వీటికి అతుక్కుపోయి ఒత్తిడి, మానసిక సమస్యలు,అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని గుర్తు చేస్తున్నారు. బుధవారం ప్రపంచ పుస్తకదినోత్సం సందర్భంగా పలువురు రచయితలు ఏమంటున్నారంటే...

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

తలదించుకుని చదివితే తలెత్తుకునేలా....

పుస్తకాన్ని తలదించుకుని చదివితే జీవితాంతం తలెత్తుకునేలా చేస్తుంది. చదివేకొద్దీ జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించడానికి గత రెండు సంవత్సరాలుగా బాలల నేస్తం పేరుతో మాసపత్రికను రూపొందిస్తున్నాం. ఇందులో పిల్లలు రాసిన బాలసాహిత్య కథలు, గేయాలు, చిత్రాలు సృజనాత్మకత అంశాలతో ఎందరో విద్యార్థులను పఠనం వైపు తీసుకెళ్తున్నాం. పిల్లలకు కథల ద్వారా లోకంలో ఉన్న మంచి చెడులు తెలుస్తాయి. పుస్తక పఠనం దినచర్యలో భాగం కావాలి.

- యువశ్రీ మురళి, అరసం జిల్లా అధ్యక్షులు



వ్యక్తిత్వం, విలువలు పెరుగుతాయి...

పుస్తక పఠనం వల్ల మనిషిలోని వ్యక్తిత్వం, విలువలు పెరుగుతాయి. జీవిత చరిత్రలు చదివితే మనిషి మనిషిగా ఎదగడమే కాక తనను తాను మంచి వ్యక్తిగా తయారు చేసుకుంటాడు. గతంలో గ్రంథాలయాలకు వెళ్లి ఇతిహాసాల నుంచి అనేక రకాల పుస్తకాలను చదవడం వల్ల ధర్మం నాలుగు పాదాలపై నిలబడిందనుకుంటాను. ఇప్పుడు ఇంట్లో అందరూ సెల్‌ఫోన్లు పట్టుకుని తమ లోకంలో ఉండిపోతున్నారు. దీనివల్ల పిల్లలకు కంటిచూపు దెబ్బతింటోంది. కళ్లజోళ్ల పరిస్థితి వస్తోంది

-పేరూరు బాలసుబ్రహ్మణ్యం, కథా రచయిత



పుస్తక పఠనం అదృష్టం

విద్యార్థుల్లో పుస్తకాలు చదవడం తగ్గిపోయింది. ఇది చాలా బాధాకరం. పుస్తక పఠనం వ్యక్తిని ఎప్పుడూ చురుకుదనంతో ఉంచుతుంది. నాకిప్పుడు 70 ఏళ్లు. 35 పుస్తకాలు రాశాను. సాహితీవేత్తలతో మమేకమవుతుంటాను. రోజూ ఏదో ఒక పుస్తకం చదవడం వల్ల ఉత్సాహంగా ఉంటున్నాను. చిన్న చిన్న ప్రయాణాల్లో సైతం తోడుగా ఎల్లప్పుడూ పుస్తకాలు ఉంటాయి. పుస్తకాలు చదవడం ప్రతిఒక్కరూ బాధ్యతగా చేసుకోవాలి. పుస్తక పఠనం దక్కిందంటే అదృష్టంగా భావించాలి.

- డాక్టర్ త్యాగదుర్గం మౌని, సాహిత్యవేత్త



తోడు నిలిచే నేస్తం పుస్తకం...

పుస్తకం జ్ఞానాన్ని పెంచే నిధి అక్షరాలను అందంగా దాచుకొన్న తరగని గని. తోడు నిలిచే నేస్తం. కానీ పుస్తక పఠనం నేటి యువతకు దూరమవుతోంది. సెల్‌ఫోన్ వాడటం తప్పుకాదు గానీ దానిని ఎంత వరకు వాడాలో అంతవరకే వాడాలి. తల్లిదండ్రులు చిన్నతనం నుంచి పుస్తక పఠనం వైపు దారి మళ్లించాలి. పిల్లలను సమయం దొరికినప్పుడల్లా మంచి పుస్తకాలను చదివించాలి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వారంతా పుస్తకాల ప్రేరణ పొందారని గమనించాలి.



- మూరిశెట్టి గోవింద్, కథ, నవలా రచయిత







రుయా.. చూపాలిలా దయ

భానుడు చెలరేగిపోతున్నాడు..నిప్పులు చెరుగుతున్నాడు. సాధారణ ప్రజలే ఈ ఎండల తాకిడికి అల్లాడిపోతుంటే మరి రోగుల పరిస్థితి మాటేంటి.. ఈక్రమంలోనే రుయాస్పత్రిలో తీసుకున్న చర్యలు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తున్నాయి. వీల్ చైర్లు, స్ట్రెచర్లపై రోగులను తీసుకువెళ్లేవారికి ఊరటనిస్తున్నాయి. ఆస్పత్రిలోని అంతర్గత మార్గాల్లో ఎండ తగలకుండా ఏర్పాటు చేసిన పచ్చని పందిళ్లు రక్షణగా నిలుస్తున్నాయి. చెప్పులు కూడా లేకుండా వచ్చే రోగులకు సైతం ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ విధమైన ఆలోచనకు శ్రీకారం చుట్టిన ఆస్పత్రి అధికారులకు రోగులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

సహజ వనరుల వెలికితీతలో అప్రమత్తం

● అంతర్జాతీయ సదస్సులో శాస్త్రవేత్త బలరాం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అరుదైన సహజ వనరుల సద్వినియోగంలో చైనాను మన దేశం అధిగమించవలసి ఉందని హైదరాబాదులోని నేషనల్ జియోలాజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ వి. బలరాం పేర్కొన్నారు. ఎస్వీయూ ఫిజిక్స్- పద్మావతి వర్సిటీ బయో టెక్నాలజీ విభాగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు రెండవ రోజు(మంగళవారం) కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఎస్వీయూ సెనేట్ హాలు వేదిక జరిగిన సదస్సులో బలరాం మాట్లాడుతూ మన దేశంలో లభించే అరుదైన మూలకాలను వెలికితీసే, వినియోగించుకునే అంశాల్లో మార్పులు రావాలన్నారు. యురేనియం వంటి సహజ వనరులను వెలికితీసే బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం మంచిది కాదన్నారు. లేకపోతే,ఈ మూలకాల నుంచీ వెలువడే వ్యర్థాలు క్యాన్సర్, కిడ్నీ జబ్బులకు కారణమవుతాయన్నారు. ఢిల్లీ తరహా కాలుష్యాన్ని కూడా ఎదుర్కోనాల్సి వస్తుందన్నారు. హైదరాబాదు బిట్స్ పిలానీ ప్రతినిధి డాక్టర్ బీఎం రెడ్డితో పాటు పలువురు శాస్త్రవేత్తలు, పరిశోధకులు పేపర్, ఓరల్, పోస్టర్ ప్రెజెంటేషన్స్ చేశారు. వీరిని అంతర్జాతీయ సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ జాన్‌సుష్మా సర్టిఫికేట్, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ దీపేంద్రసింగ్, కార్యదర్శి డాకక్టర్ ఎంఎల్‌పీ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సీకే జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ బలరాం

నేడు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పర్యటన

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్‌ఎంఈ, సెర్ఫ్, ఎన్‌ఆర్‌ఐ ఎంపవర్మెంట్, రిలేషన్స్‌శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం తిరుపతి జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 23న ఉదయం 9గంలకు శ్రీసిటీని సందర్శించి 11.30గంటల వరకు శ్రీసిటీ ఎండీ, శ్రీసిటీ ఎంఎస్‌ఎంఈ, అంబత్తూరు ఇండస్ట్రియల్ తదితర అసోసియేషన్ వారితో సమావేశం అవుతారన్నారు. అనంతరం 2గంటలరే తిరుపతికి బయలుదేరి కలెక్టరేట్‌లో 3 నుంచి 6 గంటల వరకు ఎస్‌ఎంఈశాఖ పనితీరుపై తిరుపతి, చిత్తూరు జిల్లా లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎఫ్‌ఎస్‌ఎంఈ అస్సోషియేషన్, ఛాంబర్‌ఆఫ్ కామర్స్ వారితో జరిగే సమావేశంలో పాల్గొంటారన్నారు. అనంతరం కడపకు బయలుదేరి వెళ్లతున్నట్లు తెలిపారు

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏపీవో దాడి

● మస్టర్లలో సంతకాల విషయమై వివాదం

పెళ్లకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మస్టర్లలో సంతకాల విషయమై వివాదం చెలరేగడంతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏపీవో దాడి చేసిన ఘటన మంగళవారం పెళ్లకూరు ఉపాధి కార్యాలయంలో చోటు చేసుకుంది. పునబాక పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఉపాధి పనుల మస్టర్లపై సంతకాలు చేయాలని ఏపీవో దయానందను కోరారు. అందుకు ఆయన అంగీకరించక పోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆగ్రహానికి లోనైన దయానందం తాను భోజనం తెచ్చుకున్న క్యారీ బాక్స్‌తో చంద్రశేఖర్‌పై దాడి చేశాడు. గాయపడిన చంద్రశేఖర్ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




గాయపడిన చంద్రశేఖర్

తిరుపతి- విశాఖ మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే వివిధ ప్రాంతాలకు మే 5 నుంచి జూలై ఒకటి వరకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్టణం- తిరుపతి మధ్య 18 సర్వీసులు నడుస్తాయి. మే 5 నుంచి ప్రతి సోమవారం విశాఖపట్టణంలో ప్రత్యేక రైలు(08583) బయలుదేరి తిరుమల ఎక్స్‌ప్రెస్ మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు తిరుపతికి చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైలు(08584) మే 6 నుంచి, ప్రతి మంగళవారం తిరుపతిలో బయలుదేరి విశాఖ చేరుకొంటుంది.

సరికొత్త హంగులతో శ్రీనివాస క్రీడా సముదాయం





మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీన - సిద్ధమైన రైఫిల్ షూటింగ్ కేంద్రం

● ఆధునికీకరణ పనులు పూర్తి

● నేడు ప్రారంభించనున్న మంత్రి

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయం సరికొత్త హంగులతో ముస్తాబైంది. శిథిలావస్థకు చేరుకున్న ఈ సముదాయాన్ని కూటమి ప్రభుత్వం క్రీడాకారులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దింది. దీనిని బుధవారం మంత్రి రాంప్రసాదరెడ్డి ప్రారంభించనున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇదే సముదాయంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. కూటమి అధికారంలోకి రావడం.. శాప్ చైర్మన్‌గా ఎ.రవినాయుడు నియమితులయ్యారు. తొలిప్రాధాన్యంగా ఆయన శ్రీనివాస క్రీడా సముదాయంపై దృష్టిపెట్టారు. మూడు నెలల్లో ఆధునికీకరణ పనులు పూర్తి చేయించారు. బుధవారం జరిగే ప్రారంభోత్సవానికి సంబంధించి మంగళవారం అధికారులతో సమీక్షించారు. కాగా, ఆధునికీకరణ పనుల్లో భాగంగా.. రూ.55లక్షలతో స్విమ్మింగ్‌పూల్‌ను అభివృద్ధి చేశారు. పాచిపట్టిన భవనాన్ని రూ. 28 లక్షలతో పునర్నిర్మించి ఎన్టీఆర్ క్రీడా వికాసకేంద్రంగా మార్చారు. అందులోనూ రూ.25 లక్షలతో రైఫిల్ షూటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అర్ధంతరంగా ఆగిన మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీన కేంద్రాన్ని రూ.1.37 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో పికిల్‌బాల్, వాలీబాల్, బాస్కెట్ బాల్ క్రీడాంశాల వేదికగా రూపొందించారు. రూ.29లక్షలతో లైట్లు మార్చారు. మరుగుదొడ్లను మరమ్మతులు చేయించారు. దాతల సహాయంతో మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఏర్పాటుచేయించారు. జిల్లా నుంచి జాతీయ స్థాయి వరకు పోటీలు నిర్వహించేలా తీర్చిదిద్దారు.

క్రిస్ సిటీ ఇకపై ఇండస్ట్రియల్ కారిడార్

● చిల్లకూరు, కోట మండలాల్లోని 10,834 ఎకరాల్లో ఏర్పాటు ● గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

తిరుపతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): క్రిస్ సిటీ ఇకనుంచీ ఇండస్ట్రియల్ కారిడార్ హోదా సంతరించుకోనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అసాధారణ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగమైన కృష్ణపట్నం నోడ్ (క్రిస్ సిటీ) చిల్లకూరు, కోట మండలాల పరిధిలో ఏర్పాటు కానున్న సంగతి తెలిసిందే. రూ.37,500 కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా, 4,67,500 మందికి ఉద్యోగాలు కల్పించేలా ఈ నోడ్‌కు కేంద్ర ప్రభుత్వం గతంలోనే అనుమతులిచ్చింది. తొలి దశలో రూ.1518.44 కోట్లతో మౌళిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. ఇటీవల ప్రధాని మోదీ విశాఖ నుంచీ వర్చువల్‌గా కృష్ణపట్నం నోడ్‌కు శంకుస్థాపన చేశారు. ఆ క్రమంలో సీబీఐసీ కృష్ణపట్నం నోడ్‌ను ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ యాక్ట్ 2017 కింద ఇండస్ట్రియల్ నోడ్‌గా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. కృష్ణపట్నం నోడ్ పూర్తిగా తిరుపతి జిల్లా పరిధిలో ఏర్పాటు కానుంది. చిల్లకూరు మండలం తమ్మినపట్నంలో 1131 ఎకరాలు, బల్లవోలులో 2009 ఎకరాలు, వెల్లపాలెంలో 1885 ఎకరాలు, మోమిడిలో 285 ఎకరాలు, తూర్పు కణుపూరులో 400 ఎకరాలు, కోట మండలం కర్లపూడిలో 1032 ఎకరాలు, కొత్తపట్నంలో 3651 ఎకరాలు, సిద్ధవరంలో 439 ఎకరాలు చొప్పున మొత్తం 10,834 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం ఈ ఇండస్ట్రియల్ నోడ్ కోసం కేటాయించింది. దీంతో ఈ రెండు మండలాల్లోని ఎనిమిది గ్రామాలకు చెందిన 10,834 ఎకరాలను ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అసాధారణ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో క్రిస్ సిటీగా పరిగణనలో ఉన్న ఈ ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఇకనుంచీ మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు మొదలు కానున్నాయి.

ప్రజా రవాణాధికారిగా వెంకటరావు



తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజారవాణాధికారిగా కె.వెంకటరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రధాన కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఈయన ప్రకాశం జిల్లా డీపీటీవోగా పనిచేస్తున్నారు. ప్రస్తుతమున్న నరసింహులు ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఇదేరోజు వెంకటరావు బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఏఐతో ప్రయోజనాలెన్నో?

● సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి



సదస్సులో ప్రసంగిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, అలా కలిగే ప్రయోజనాలపై పరిశోధనలు సాగాలని సంస్కృత యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఏఐ టెక్నాలజీపై వర్సిటీలో రెండు రోజుల జాతీయ సదస్సును మంగళ వారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన మోడరన్ స్కూల్లో టెక్నాలజీ అమలు చేస్తామన్నారు. రిజిస్ట్రార్ నారాయణరావు మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీకి సంబంధించిన అంశాలు ప్రాచీన భారతీయ విజ్ఞానంలో ఉన్నాయన్నారు. సీ-డాక్ ఈడీ సుదర్శన్ మాట్లాడుతూ ఏఐతో నూతన పదాల సృష్టి జరుగుతూ ఉందన్నారు. ఏఐ ద్వారా భారతీయ జ్ఞానపరంపరను కొత్త తరానికి అందించాలన్నారు. మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ కామకోటి వర్చువల్‌గా మాట్లాడారు. ఏఐని సంస్కృతంతో మేళవించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గణపతిభట్, ప్రొఫెసర్ రమాశ్రీ, డీన్ రజనీకాంత్‌శుక్లా, తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ కృష్ణప్రపూర్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మే 6 నుంచి పద్మావతి పరిణయోత్సవాలు

తిరుమల, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు మే 6 నుంచి 8వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనంలోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను నిర్వహించనున్నారు. తొలిరోజు మలయప్పస్వామి గజవాహనం, రెండవరోజు అశ్వవాహనం, మూడోరోజు గరుడవాహనంపై వేంచేపు చేస్తారు. మరోవైపు ఉభయ నాంచారులను ప్రత్యేక పల్లకీలో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. తర్వాత కనులపండువగా కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఉత్సవం నేపథ్యంలో మూడురోజుల పాటు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవలను టీటీడీ రద్దు చేసింది.

పోర్ట్‌బ్లెయిర్ మున్సిపల్ చైర్మన్ పీఠం టీడీపీదే



కౌన్సిలర్లతో మాధవ నాయుడు, అండమాన్ నికోబార్ దీవుల టీడీపీ అధ్యక్షుడు మాణిక్యరావ్ యాదవ్ తదితరులు

డక్కిలి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అండమాన్‌లోని (శ్రీవిజయపురం) పోర్ట్‌బ్లెయిర్ మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, అండమాన్ నికోబార్ దీవుల ఇన్‌చార్జి వెంపటి మాధవ నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన ఫోన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఈనెల 24న పోర్ట్‌బ్లెయిర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందన్నారు. మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉండగా, బీజేపీకి 10, టీడీపీకి 2, స్వతంత్ర అభ్యర్థి 1, కాంగ్రెస్‌కు 10, డీఎంకే పార్టీకి 1 కౌన్సిలరు ఉన్నారని పేర్కొన్నారు. బీజేపీ, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో టీడీపీ అభ్యర్థి సాహాల్ అహ్మద్ చైర్మన్‌గా ఎన్నికవడం తథ్యమన్నారు.

సంస్థాగత ఎన్నికలకు సిద్ధం కండి



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరెడ్డి

డక్కిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న టీడీపీ సంస్థాగత ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్‌కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. త్వరలో నిర్వహించనున్న సంస్థాగత ఎన్నికల్లో గ్రామ, బూత్ కమిటీలతో పాటు మండల కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో డక్కిలి పట్టణ అధ్యక్షుడు చంద్రారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గద్దం చంద్రశేఖరరెడ్డి, మోపూరు సొసైటీ అధ్యక్షుడు పులి జనార్దనరెడ్డి, పీపీ చౌదరి, రమేష్ నాయుడు, రంగినేని రాజా, వెంకటేశ్వర్లు నాయుడు, దందవోలు పెంచలరెడ్డి, డక్కిలి సునీల్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడల్లో ప్రతిభచాటిన విద్యార్థులను సన్మానించిన రోటరీక్లబ్ సభ్యులు

గూడూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రోటరీక్లబ్ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ధరిత్రీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభచాటిన విద్యార్థులను సన్మానించి, వారికి ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించి ఉల్లాసంగా ఉండేందుకు క్రీడలు దోహదపడుతాయన్నారు. విద్యార్థులు ఏదో ఒక క్రీడలో ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో సనత్‌కుమార్, జడ్పీ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు మాధవీలక్ష్మి, భారతి, పీడీలు విజయలక్ష్మి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిత



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): చదువు ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభచాటిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే చదువులపై శ్రద్ధ చూపాలన్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ చాటిన శ్రేష్ఠరెడ్డికి ప్రథమ బహుమతిగా లాప్‌టాప్, తుదిశ్రీ, నంద కిషోర్‌రెడ్డికి ద్వితీయ బహుమతిగా ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీకాంత్, శ్రీహరిబాబు, హరిబ్రహ్మా, మల్లి, సాయి చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

రాడార్ ఇంజనీరింగ్‌లో శిక్షణ

కోట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ డ్రైవ్ అసిస్టెంట్ సిస్టమ్ ఏ ప్రాక్టికల్ వర్క్‌షాప్ ఆన్ రాడార్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సూరత్‌కల్‌లోని ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీహరి, షాషా, వందన ముఖ్య అతిథులుగా విచ్చేసి రాడార్ ఇంజనీరింగ్, అనువర్తనాలపై ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. డ్రైవర్ లెస్ వెహికల్ నియంత్రణ చేసే విధనాన్ని ప్రయోగాత్మకంగా విద్యార్థులకు వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ప్రయోగాత్మక శిక్షణ తరగతుల వల్ల భవిష్యత్తులో కోర్ జాబ్స్ తెచ్చుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రామకృష్ణప్రసాద్, లావణ్య, హరినాధ్‌రెడ్డి పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణాపై చర్యలు తీసుకోండి

గూడూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విందూరు చెరువులో తుమ్మచెట్లను కొంతమంది అక్రమంగా నరికి కలపను తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. చెరువులో పెరుగుతున్న తుమ్మచెట్లకు వేలం నిర్వహించకుండా అక్రమంగా నరికి తరలిస్తు న్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముగిసిన పోషణ్ పక్వాడ వారోత్సవాలు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమ్మరిగుంట, పోలీస్ స్టేషన్, తూర్పువీధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా సీడీపీవో షంషాద్ బేగం మాట్లాడుతూ వెయ్యి రోజుల సంరక్షణ కోసం గర్భం ధరించినప్పటి నుంచి జాగ్రత్తలు పాటించాలన్నారు.

కోట: మండల పరిధిలోని జరుగుమల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణమ్మ ఆధ్వర్యంలో గర్భిణులు, తల్లులకు మొదటి వెయ్యి రోజులు సంరక్షణ, పిల్లల పోషణపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పోషకాహారాన్ని తయారు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు విజయలక్ష్మి, మీరమ్మ, స్వాతి, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని దిగువ చావాలిలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. సీడీపీవో ఉమామహేశ్వరి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లతో పాటు తృణ ధాన్యాలు తీసుకోవాలన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

బాలాయపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) మండలంలోని వెంకటరెడ్డి పల్లిలో టిఫిన్ దుకాణంలో ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివశంకర్ పట్టుకున్నారు. దుకాణం నిర్వాహకుడు కిరిటీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మట్కా కేసులో 8 మంది అరెస్టు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొమిడి కాలవ వద్ద మట్కా(సింగిల్ డిజిట్) ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుబ్బారావు మంగళవారం తెలిపారు. పట్టణానికి చెందిన బీదా ధర్మయ్య, శివశంకర్, కాలేషా, మహ్మద్ అలీ, రాజేంద్ర, వీర రాఘవులు, హేమంత్, వెంకటేష్‌ను అరెస్టు చేసి, వారి వద్ద రూ.54,400 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8వ వార్డు పెరియవరం అరుంధతివాడలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వీర రాఘవులును అరెస్టు చేశామని ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.





రాణీపేటలో చెత్త చెదారాలతో నిండిపోయిన డ్రైనేజీ - కాలువలోనే తాగునీటి పైపు

డ్రైనేజీ ఇలా.. మురుగు పారేదెలా..?

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాణీపేట ప్రధాన రహదారిలో డ్రైనేజీ పూర్తిగా చెత్తచెదారాలతో నిండిపోయింది. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, ఇతర వ్యర్థాలు చేరడంతో మురుగునీరు పారడానికి వీలు లేకుండా మూసుకుపోయింది. అంతేకాకుండా పట్టణంలోని టీచర్స్ కాలనీ, రాణీపేట, మందరిల్లు, తెలిమిట్ట ప్రాంతాల్లో తాగునీటి పైపులు డ్రైనేజీ కాలవల్లోనే ఉండడంతో మంచినాణ్యతపై పట్టణ ప్రజలు ఆందోళన చేస్తున్నారు. పైపుల మరమ్మతులు, లీకేజీ సమయంలో కలుషి నీరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలిమిట్ట దారిలో చెత్తకుప్ప వద్ద గత వారం రోజులుగా డ్రైనేజీ పైపు లీకేజీ అయి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువల్లో పూడిక తీయడంతో పాటు తాగునీటి పైపు లైన్లను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు: ముగ్గురికి గాయాలు







బోల్తా పడిన ట్రాక్టర్ - నుజ్జునుజ్జు అయిన కారు - ప్రమాదంలో గాయపడిన కృష్ణచంద్

దొరవారిసత్రం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం టపాయిండ్లు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం కారు ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన కృష్ణచంద్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయన భార్య పల్లవికి స్వల్ప గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ గురవయ్య కూడా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం కృష్ణచంద్‌ను చెన్నైకు తీసుకెళ్లగా ట్రాక్టర్ డ్రైవర్ గురవయ్యను నెల్లూరుకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ అజయ్‌కుమార్ రోడ్డుపై ఉన్న వాహనాలను పక్కకు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సర్వీసు రోడ్డు నిర్మించండి



ఎన్‌హెచ్ పీడీ చౌదరికి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణా రెడ్డి, రైతులు

నాయుడుపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తూర్పు కనుపూరు నడుమ సాగరమాల రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్డు నిర్మించాలని కోరుతూ మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రైతులు నెల్లూరు ఎన్‌హెచ్ పీడీ చౌదరికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ సాగరమాల భూసేకరణ సమయంలో ఆర్డీవో, తహసీలార్లు గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు, అండర్ పాసులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం గ్రామాల వద్ద సర్వీసు రోడ్డు, అండర్ పాసులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడతున్నారన్నారు. కార్యక్రమంలో సన్నారెడ్డి హరినాథరెడ్డి, వాకాటి సుధాకర్ రెడ్డి, జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి, తంబిరెడ్డి సురేష్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వంటగది ప్రారంభం



వంటగదిని ప్రారంభిస్తున్న రోటరీ అధ్యక్షుడు జయరాజగోపాల్, కార్యదర్శి రామ్మోహన్, పక్కన ఉపాధ్యాయులు

నాయుడుపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రూ.1.50 లక్షలతో నిర్మించిన భోజనశాల, వంటగదిని మంగళవారం రోటరీక్లబ్ అధ్యక్షుడు పసల జయ రాజగోపాల్ ప్రారంభించారు. భోజనశాలకు యూఎస్ఏకి చెందిన బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ సహకారంతో తాగునీరు వసతి కల్పించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి రామ్మోహన్, విశ్రాంతి మునగాల కృష్ణారావు, ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, ఉపాధ్యాయులు కందనూరు సంజయ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



ప్రింటర్ అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

గూడూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండోపట్టణ పరిధిలోని జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌కు మంగళవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ప్రింటర్ అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను మెరుగు పరిచేందుకు తమ క్లబ్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామన్నారు. దాతల దాతృత్వాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలన్నారు. ఇదే పాఠశాల పూర్వ విద్యార్థులైన రోటరీక్లబ్ సభ్యులు బాలకృష్ణమరాజు, సుబ్రహ్మణ్యం, మల్లికార్జున్, మహిధర్‌రెడ్డి సహకారంతో ప్రింటర్ అందజేశామన్నారు. కార్యక్రమంలో దశరధ రామిరెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎన్‌వీ రత్నం, రాంప్రసాద్, సురేష్‌రెడ్డి, మృదుల తదితరులు పాల్గొన్నారు.

భజన గురువులకు సన్మానం

గూడూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లో మంగళవారం ప్రాచీన జానపద కళానిలయం వ్యవస్థాపకుడు, పండరి భజన గురువు కృష్ణదాస్ ఆధ్వర్యంలో భజన గురువులను మహానందయ్య, సుబ్బరాయుడు, రామాంజనేయును సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఈనాటికి మానవ సంబంధాలు బతికే ఉన్నాయంటే అందుకు కారణం అలనాటి జానపద కళలే కారణమన్నారు. జానపద కళలు మన సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెళ్లకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జీలపాటూరు, చిల్లకూరు, చావాలి, టెంకాయతోపు, పెళ్లకూరు, కొత్తూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ ఏఈ సురేష్‌బాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏపీఎన్‌జీవో కార్యవర్గ సభ్యుల ఎన్నిక



సభ్యులను సన్మానిస్తున్న ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీఎన్‌జీవో కార్యాలయంలో మంగళవారం గూడూరు తాలూకా కార్యవర్గ సభ్యుల ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా సతీష్ జాయింట్ సెక్రటరీలుగా సుబ్రహ్మణ్యం, రేణుకమ్మను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల అధికారిగా పెంచలయ్య వ్యవహించారు. నూనతంగా ఎన్నికైన సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, తనూజ్ కుమార్, నాగరాజ్‌కుమార్, శంకరరాజు, రవికుమార్ పాల్గొన్నారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న డీవైఈవో సనత్‌కుమార్

చిల్లకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే పేదరికం నిర్మూలన జరుగుతుందని డిప్యూటీ ఈవో సనత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచి బలోపేతం చేయాలన్నారు. వార్షికోత్సవ కార్యక్రమాల వల్ల విద్యార్థులలో దాగి ఉన్న కళలను వెలికి తీయవచ్చన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రవూఫ్, హెచ్‌ఎం చంద్రశేఖర్, మాధవయ్య, చంద్ర, మంజుశ్రీ, సంధ్యారాణి, శ్రీనివాసులు, లీల, కామేశ్వరి, ఆదిలక్ష్మి, నాగభూషణమ్మ, సుగుణ, సురేంద్ర కుమార్, మస్తాన్, షకీలా తదితరులు పాల్గొన్నారు.

'పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం'

కోట, ఏప్రిల్ 22: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఆర్‌డీ సంస్థ చైర్మన్ బషీర్ కోరారు. కోటలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బషీర్‌తో పాటు టీడీపీ నాయకులు మొక్కలు నాటి, వాటిని దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి దత్తత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లప్పరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి, తీగల సురేష్ బాబు, భాస్కర్‌రెడ్డి, శ్యామ సుందరరెడ్డి, దారా సురేష్, మధు యాదవ్, కోటారెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో చెత్తంతా రోడ్డు పైకి



సూళ్లూరుపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణాన్ని డంపింగ్ యార్డు సమస్య వెంటాడుతూనే ఉంది. హోలిక్రాస్ కూడలి సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న డపింగ్ యార్డులో వారం రోజుల క్రితం మంటలు చెలరేగడంతో నాలుగు రోజుల పాటు పొగతో పట్టణవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసినా పూర్తిగా తగ్గలేదు. ఇప్పటికీ డంపింగ్ యార్డు నుంచి తేలికపాటి మంటలు, పొగ వస్తూనే ఉంది. ఇదిలా ఉండగా మున్సిపాలిటీలో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే చెత్త డంపింగ్ యార్డు ముందుభాగంలో పోయడంతో జాతీయ రహదారి పైకి చేరింది. ఇటు పొగతో పాటు రోడ్డుపై చేరిన చెత్త, దుర్వాసనతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు చొరవచూపి డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధికి సహకరించండి



రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

కోట, ఏప్రిల్ 22: చెన్నై - బెంగళూరు కోస్టల్ కారిడార్ అభివృద్ధికి రైతులు పూర్తి సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ కోరారు. మండల పరిధిలోని శ్రీనివాససత్రం, కొత్తపట్నం, యమదిన్నెపాళెం, గున్నంపడియ గ్రామాల్లో మంగళవారం జేసీ పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో సాగులో ఉన్న వేరుశనగ పంటలకు సంబంధించి రైతులతో చర్చించారు. రోడ్డు పనుల్లో భూములు కోల్పోయే ప్రతి రైతునూ అన్ని విధాల ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయజయరావు, సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్‌వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పట్టాలివ్వండి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంద్ర గ్రామంలో ఎస్సీ, ఎస్టీలు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు శివకుమార్, బీవీ రమణయ్య మంగళవారం కోరారు. ఎన్నో ఏళ్లుగా పేదలు భూములు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని, అధికారులు స్పందించి భూములను పట్టాలను అందజేయాలని కోరారు.

దుస్తుల పంపిణీ

చిల్లకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువరాజుపాళెం గిరిజన కాలనీవాసులకు మంగళవారం పీపుల్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఫౌండర్ మల్లికార్జున్ మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కాలనీలోని పిల్లలంతా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో అరుణ్ బాబు, స్థానికులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Sullurpet బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన ... ప్రకారం యావన్మందికి తెలుపునది శ్రీ గుంటుమడుగు వెంకటేశ్వర్లు తండ్రి వెంకట రామరాజు, అరిమేనుపాడు గ్రామం, ఓజిలి మండలం, తిరుపతి జిల్లా గారికి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని ... కాబట్టి సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైనను ఎటువంటి ... నేటి నుండి 7 దినములలో ఈ క్రింది చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

SCHEDULE

తిరుపతి జిల్లా తిరుపతి రి.డి. నాయుడుపేట సబ్ రి.ఆఫీసు పరిధిలో చేరిన ఓజిలి మండలంలో చేరిన అరిమేనుపాడు గ్రామ పంచాయితీ అరిమేనుపాడు గ్రామములో LPM No:1375, ఖాతా నెం.249కు సర్వే నెం.174-5 ... హద్దులు: తూర్పు: ... దక్షిణం: రోడ్డు, పడమర: ... ఉత్తరం: ... ఈ హద్దుల గల 2160 చ.అ.లు లేక 30 అంకణములు లేక 240 చ.గజముల మార్పు 201.6 చ.మీ.లు గల ఖాళీ స్థలమున్నూ ...

S.Sreeramulu Yadav, M.A.,B.L.,
Advocate, Off: 3-2-155, old Shar Busstand Road, Sullurpet. Cell: 94404 56976

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Nellore-2 బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన ... ప్రకారం యావన్మందికి తెలుపునది ...

SCHEDULE

[illegible]

Perepi Venugopal, B.Com., B.L.,
Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528